J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

లాయర్

సంపుటి : 44 సంచిక : 44 04.04.2025, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

# ఆంధ్రాలో.. మూడు ముక్కలాట



## ఎవరికి వారు ప్రగల్భాల బాట

**పడకేసిన పార్టీలకు ప్రాణం పోశాం - టీడీపీ**

**నలభై ఏళ్ళ పార్టీని మేమే నిలబెట్టాం - జనసేన**

**మోదీ ఛరిష్మాతో బాబు గెలిచారు - బీజేపీ**

కూటమి పాలన సాగుతున్న ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం ప్రత్యేక రాజకీయ పరిస్థితులు నెలకొన్నాయి. తమ గెలుపే లక్ష్యం అనడం కన్నా... జగన్‌మోహన్‌రెడ్డి ఓటమే ధ్యేయం అన్నట్లుగా **2024** ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన ఒక్కటై శ్రమించాయి. ముక్తకంఠంతో జగన్‌మోహన్‌రెడ్డి వైఫల్యాలను, అవినీతి భాగోతాలను ప్రజలకు వినిపించాయి. వైఎస్సార్సీపీని గద్దె దించడం కోసం అనునిత్యం తపించాయి. ఎవరూ ఊహించని విధంగా జగన్‌రెడ్డి పార్టీని **11**సీట్లకే పరిమితంచేసి తామనుకున్న లక్ష్యాన్ని సాధించాయి.




ఇంతవరకు బాగానే ఉన్నా ఎన్నికల ఫలితాల అనంతరం ఎవరికి వారే ఇది తమ ఘనతే అన్నట్లుగా జబ్బలు చరుచుకోవడం, ప్రగల్భాలు పలుకుతుండడం విశ్లేషకులను సైతం విస్మయపరుస్తోంది. ఎవరికి వాళ్ళు మేం గొప్పంటే.. మేం గొప్ప అన్నట్లుగా ప్రచారం చేసుకుంటూ, అసలు అందరినీ గెలిపించిన ప్రజలను పట్టించుకోవడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. వారి అభివృద్ధిపై ఫోకస్ మాని, సొంతడబ్బా కొట్టుకోవడంపైనే నాయకులు దృష్టిసారిస్తున్న తీరు చూసి విశ్లేషకులు సైతం విస్తుపోతున్నారు. మూడు పార్టీల ద్వితీయశ్రేణి నాయకత్వమే ఇందుకు పరిమితమైందా? అంటే... కాదనే సమాధానమే వినిపిస్తోంది. అగ్రనాయకులు సైతం దీనికి అతీతం కాదన్నట్లు మాట్లాడుతుండడం అందరినీ విస్మయానికి గురిచేస్తోంది. ఇక ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాల వేదికల్లోనూ నువ్వెంత అంటే నువ్వెంత అనే స్థాయిలో వార్ జరుగుతోందంటే అతిశయోక్తి కాదేమో.

### ముందు సమష్టిగా.. తర్వాత తలోదారి అన్నట్లుగా..

వెనుకటికొకడు నిస్సత్తువతో నీరసించిపోయి, కదల్లేని స్థితిలో, చచ్చీచెడి గోడను ఆసరగా పట్టుకుని లేచి నిలబడ్డాడట. తీరా పరిస్థితి కొంత స్థిమితపడ్డాక, ఆ గోడే తన ఆసరాతో నిలుచుందని చెప్పుకుంటూ ప్రగల్భాలకు పోయాడట. ఇలా ఉంది రాష్ట్రంలో కూటమి నాయకుల పరిస్థితి. జగన్ జమానాలో ఎన్నో డక్కాముక్కీలు తిని పార్టీలను కాపాడుకునేందుకు

2లో

# జగనే మాయ



## అందివచ్చిన కాలం.. పెద్ద చేపకు గాలం

- **మద్యం స్కాంపై టీడీపీ దూకుడు**
- **జగనే లక్ష్యంగా వ్యూహాలు?**
- **ఆధారాలు అమిత్‌షాకి సమర్పణ**

రాష్ట్రంలో మద్యాసురుల వేట మొదలైంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ మద్యం దుకాణాల పేరిట జరిగిన దోపిడీని బట్టబయలు చేయడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం శరవేగంగా పావులు కదుపుతోంది. ఈనేపథ్యంలోనే ఐజీ ర్యాంక్ అధికారి రాజశేఖర్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన సిట్ (ప్రత్యేక దర్యాప్తు బృందం) అవసరమైన సాక్ష్యాల సేకరణలో బిజీబిజీగా ఉంది. అదే సమయంలో ఇప్పటికే అదుపులోకి తీసుకున్న ఏపీ బేవరేజస్ కార్పొరేషన్ సిబ్బంది ఇచ్చిన వాగ్మూలం ఆధారంగా గత ప్రభుత్వ పెద్దల పాత్రపై నివేదిక రూపొందిస్తోంది. ఈనేపథ్యంలో ఇటీవల లోక్‌సభలో టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు గత ప్రభుత్వంలో చోటు చేసుకున్న మద్యం కుంభకోణం విలువ **18**వేల కోట్లని, అందులో **4** వేల కోట్ల వరకు బినామీల పేరుతో ఇప్పటికే దేశం దాటిపోయిందని ఆరోపించారు. ఈడీ, సీబీఐ వంటి సంస్థలతో దర్యాప్తు చేస్తే వాస్తవాలు వెల్లడవుతాయని ఆమేరకు కేంద్రం దృష్టిసారించాలని కోరారు. అదే సమయంలో ఏపీలో చోటు చేసుకున్న మద్యం కుంభకోణం ఢిల్లీ, ఛత్తీస్‌గడ్, తమిళనాడు మద్యం కుంభకోణాలకంటే చాలా రెట్లు పెద్దదంటూ బాంబుపేల్చడం కలకలం రేపింది.

### గత ప్రభుత్వంలో ఇలా..

రాష్ట్ర విభజన తర్వాత అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం 2014–19 మధ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తరహాలోనే ప్రైవేటు మద్యం షాపులను కొనసాగించింది. లాటరీ ద్వారా అభ్యర్థులకు మద్యం షాపులను కేటాయించింది. తద్వారా ప్రభుత్వనికి ఆదాయం సమకూరేది. అయితే, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్ సర్కారు 2019–2024 మధ్య పాత విధానాన్ని తొలగించి ప్రభుత్వమే మద్యం షాపులు నిర్వహించేలా ఆదేశాలిచ్చింది. తమిళనాడు తరహాలో ప్రభుత్వ సారాయి దుకాణాలని నడిపింది. అయితే, సదరు నిర్ణయం ద్వారా భారీ కుంభకోణానికి వైఎస్సార్‌సీపీ అగ్రనాయకత్వం తెర తీసిందని కూటమి నాయకులు ఆరోపిస్తున్నారు.




### అడుగడుగునా దోపిడీ?

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పక్కా ప్రణాళికతో మద్యం కుంభకోణం జరిగిందని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పార్లమెంట్ సాక్షిగా వివరాలు బట్టబయలు చేశారు. ఆర్ఆర్ఆర్, బాహుబలి, పుష్ప సినిమాల వసూళ్ల కంటే మద్యం అక్రమ వసూళ్లు పదిరెట్లు ఎక్కువ జరిగాయని ఆరోపించారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో ఐదేళ్లలో 99వేల కోట్ల రూపాయలు మద్యం వ్యాపారం జరగగా, అందులో 660 కోట్ల మేరకే డిజిటల్ లావాదేవీలు జరిగాయని, మిగిలిందంతా క్యాష్ ట్రాన్సాక్షన్స్ కావడమే ఇందుకు నిదర్శనమన్నారు. కరోనా సమయంలోనూ డిజిటల్ లావాదేవీలు జరపకుండా పక్కా ప్రణాళికతో కుట్ర చేశారని స్పష్టం చేశారు. మొత్తంగా 18 వేల కోట్లు దారిమళ్లాయని, అందులో 4వేల కోట్లు దుబాయ్, ఆఫ్రికాలకు తరలిపోయాయని వెల్లడించారు. వైఎస్ ఫ్యామిలీకి దగ్గరగా ఉండే హైదరాబాద్‌కు చెందిన ఓ మౌలిక సదుపాయాల కల్పన సంస్థ నిర్వాహకుడు

11లో




## జీవితంలో ఎదగడానికి..
# దగ్గర దారులుండవు
## 'కష్టపడితేనే ఉన్నతస్థాయి' - మంత్రి నారాయణ

జీవితంలో ఎవరైనా సరే, ఉన్నతంగా ఎదగడానికి దగ్గర దారులంటూ ఏమీ ఉండవని, కష్టపడటమే ఏకైక మార్గమని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ అనుభవపూర్వకంగా చెప్పారు. ఇటీవల నెల్లూరు నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో జరిగిన జాబ్ మేళాలో ఉద్యోగాలు సాధించినవారికి నియామక పత్రాలను ఆయన అందజేశారు. పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ రామారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఎంత కష్టపడితే అంత ఎత్తుకు ఎదుగుతామన్న విషయం ఎవరూ మరచిపోకూడదన్నారు. ఉద్యోగంలో చిన్నా పెద్ద తేడాలు ఉండవని, నిజాయితీగా కష్టపడి పనిచేస్తే ఉన్నత స్థానానికి ఎదగవచ్చు నన్నారు. పార్ట్‌టైం లెక్చరర్ స్థాయి నుండి నేటి స్థితికి తాను ఎదగడానికి కారణం కేవలం కష్టపడి పనిచేయడం మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికీ తాను ప్రతిరోజూ 18 గంటలు కష్టపడతానని తెలిపారు. ఈ కళాశాల ఏర్పడిన 60 సంవత్సరాల్లో మొదటిసారిగా 95శాతం మందికి ఉద్యోగాలు లభించడం అభినందనీయమన్నారు.

### చక్కెరఫ్యాక్టరీ స్థలంలో..ఇండస్ట్రియల్ పార్కు

కోవూరు చక్కర ఫ్యాక్టరీ స్థలంలో కాలుష్యం లేని ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు ఇటీవల జరిగిన కలెక్టర్ల సమావేశంలో నిర్ణయించడం జరిగిందని, వీలైనంత త్వరలో ఆయా రైతులు, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించి పరిశ్రమల స్థాపనకు వేగవంతమైన చర్యలు తీసుకుంటామన్నారు.

### ఏసీ బస్‌స్టాప్‌ను పారంభించిన మంత్రి :

నెల్లూరు నగరంలోని గాంధీ బొమ్మ సెంటర్లో పునరుద్ధరించిన ఏసీ బస్‌స్టాప్‌ను ఇటీవల రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి నారాయణ ప్రారంభోత్సవం చేశారు. సంవత్సరంలో తొమ్మిది నెలలు నెల్లూరులో ఎండవేడిమి అధికంగా ఉంటుందని, వృద్ధులు, చిన్నారులు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో దేశంలో ఎక్కడా లేనివిధంగా గతంలోనే తమ ప్రభుత్వంలో ఏసి బస్‌స్టాప్‌లను ప్రారంభించామన్నారు. అయితే వైకాపా ప్రభుత్వ నిర్వాకంతో వాటిని మూసివేశారని, తిరిగి వాటిని పునరుద్ధరిస్తున్నామన్నారు. ఇదే సమయంలో మానవ రహితంగా రోడ్లను శుభ్రం చేసే ఆధునిక యంత్రాలను మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సూర్య తేజ తదితరులు పాల్గొన్నారు.

# దేశ ఆర్థికాభివృద్ధికి.. జీఎస్టీ కీలకం!
## -- శ్రీసిటీ సదస్సులో ఆడిట్ కమిషనర్ ఆనంద్‌కుమార్ --



కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెందిన కేంద్ర పరోక్ష పన్నులు, సుంకాల మండలి (సి.బి.ఐ.సి), భారత పరిశ్రమల సమాఖ్య (సి.ఐ.ఐ)-శ్రీసిటీ సంయుక్త ఆధ్వర్యంలో, ఇటీవల కేంద్ర వార్షిక బడ్జెట్, పన్నులు, ఆడిటింగ్‌పై అవగాహన సమావేశం జరిగింది. గుంటూరు ఆడిట్ కమిషనరేట్ కమిషనర్ పి.ఆనంద్‌కుమార్ నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. పరిశ్రమలకు తాజా పన్నుల విధానం, ఇతర మార్గదర్శకాలు, కేంద్ర బడ్జెట్ ప్రభావం తదితర అంశాలపై ఆనంద్‌కుమార్ అవగాహన కల్పించారు. ప్రభుత్వం జీఎస్టీని సరళతరం చేయడానికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. 'ఒకే దేశం, ఒకే పన్ను' విధానం వల్ల పన్ను చెల్లింపుదారుల సంఖ్య 70 లక్షల నుంచి 140 లక్షలకు పెరిగిందని, మధ్యస్థ పన్ను రేటు 14.5 నుండి 11.5శాతానికి తగ్గిందని, ఫలితంగా ఆర్థికవృద్ధి వేగంగా కొనసాగుతోందని తెలిపారు. తొలుత, ఆనంద్‌కుమార్‌ను శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి స్వాగతించి, ఆయనతో తనకున్న పరిచయాన్ని గుర్తుచేసుకున్నారు. పారిశ్రామిక వర్గాలకు అవగాహన కలిగించే ఉద్దేశ్యంతో ఈ సమావేశం నిర్వహిస్తున్నందుకు వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. పారిశ్రామిక సంస్థలు, ముఖ్యంగా విదేశీ సంస్థల విధాన మార్పులకు అనుగుణంగా ఇలాంటి పరస్పర చర్చలు ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు.

# ఉపాధ్యాయుల సమస్యలు తీర్చండి..సారూ!..
## కలెక్టరేట్ వద్ద 'ఫ్యాప్టో' ధర్నాందోళన




తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలంటూ ఈనెల 2న ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ఆధ్వర్యంలో నెల్లూరు కలెక్టరేట్ వద్ద ధర్నా జరిగింది. ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని ఫ్యాప్టో నాయకులు మధుసూదనరావు, ఎస్‌కె జావీద్‌లు మాట్లాడుతూ11వ పీఆర్‌సి గడువు ముగిసి 21 నెలలైనప్పటికీ వేతన సవరణ సంఘం ఏర్పాటుచేయకపోవడం దారుణమన్నారు. సీపీఎస్, జీపీఎస్ విధానాలను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని వారు ప్రభుత్వానికి విన్నవించారు. 11వ పీఆర్‌సి బకాయిలను, డీఏ.. తదితర బకాయిలను వెంటనే చెల్లించి ఉపాధ్యాయుల కుటుంబాలను ఆదుకోవాలన్నారు. అనంతరం, తమ డిమాండ్ల వినతిపత్రాన్ని కలెక్టరేట్ అధికారులకు సమర్పించారు. ఫ్యాప్టో కో-ఛైర్మెన్లు మురళీకృష్ణ, ప్రసాద్, నాయకులు ఎన్‌వి రమణయ్య, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఐఏబీ సమావేశం
# నిర్వహించండి
### ఇన్‌చార్జిమంత్రికి సోమిరెడ్డి లేఖ



జిల్లాలో రెండో పంట వేసుకునే రైతాంగానికి నీటి కేటాయింపులు చేసేందుకు ఐఏబీ సమావేశం నిర్వహించాలని కోరుతూ జిల్లా ఇన్‌చార్జిమంత్రి ఎన్‌ఎండి ఫరూక్‌కు ఇటీవల సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి లేఖ రాశారు. ప్రస్తుతం సోమశిల జలాశయంలో 53.347 టీఎంసీలు, కండలేరులో 48.157 టీఎంసీల నీటి నిల్వలున్నాయని, రైతులకు అవసరమైన నీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన ఆ లేఖలో విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టర్ ఆనంద్‌కు కూడా ఆయన ఆ లేఖ ప్రతిని పంపించినట్లు తెలిపారు.

# మూడు ముక్కలాట
(మొదటిపేజీ తరువాయి)

ఆపసోపాలు పడి, పార్టీ మారకుండా నాయకులను నిలువరించేందుకు అష్టకష్టాలు ఎదుర్కొని, ఈసారి లేకుంటే ఇంకెప్పుడూ లేదు అన్నట్లుగా పోరాడి ఎన్నికల్లో విజయం సాధించారు కూటమి పార్టీల నాయకులు. అయితే, ప్రభుత్వ ఏర్పాటు తర్వాత తలోదారి అన్నట్లుగా సాగుతూ సొంతడబ్బాకు పరిమితం అవుతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఈక్రమంలో మిత్రపక్ష పార్టీలను చిన్నబుచ్చుతున్నామనే స్పృహ కూడా లేకుండా ఇష్టారాజ్యంగా మాటలు తూలుతూ, మేమే తురుంఖాన్‌లు అన్న రేంజ్‌లో రెచ్చిపోతున్నారు. వీరికి ఆయా పార్టీల్లోని కోతలరాయుళ్లు జత కలుస్తుండడంతో ఏపీలో రాజకీయం రంజుగా మారిందనే వాదనలు వినిపిస్తున్నాయి.

### జనసేనతో మొదలు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మూడు పార్టీల నాయకులు ఆ క్రెడిట్ తమదే అన్నట్లు అప్పుడప్పుడు డప్పు కొట్టుకుంటున్నా.. ఈ విషయం చినికి చినికి గాలివానగా మారింది మాత్రం పిఠాపురంలో జరిగిన జనసేన ఆవిర్భావ సభతోనే అన్నది నిజం. వాస్తవానికి ఆవిర్భావ సభలో పార్టీ ప్రస్థానంపై, 2024 ఎన్నికల్లో సాధించిన ఘనవిజయంపై మాట్లాడేందుకు మాత్రమే నాయకులు పరిమితమై ఉంటే బాగుండేదనే వాదనలు వినిపిస్తున్నాయి. అయితే పార్టీ భవిష్యత్ ప్రణాళికలు, సభ్యత్వ నమోదు, రాయలసీమతో పాటూ ఇతర ప్రాంతాల్లో పార్టీ విస్తరణపై దృష్టి సారించకుండా, కూటమి గెలుపులో ముఖ్య భూమిక తమదే అన్నట్లు కొందరు నాయకులు వీరావేశంతో వేదికపై రెచ్చిపోవడంతోనే సమస్య పెద్దదైందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇక ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఏకంగా 40 ఏళ్ల తెలుగుదేశం పార్టీని నిలబెట్టిన ఘనత తమదే అంటూ ప్రకటించడం పుండుమీద కారం చల్లినట్లయ్యిందని రాజకీయ నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. కూటమి ధర్మాన్ని విస్మరించి గెలుపు మొత్తం తమ చలవే అన్నట్లు పవన్ మాట్లాడడం అపరిపక్వత, తొందరపాటు తనమేనని విమర్శిస్తున్నారు. దీన్ని ఆసరాగా చేసుకుని పవన్ సోదరుడు, జనసేన కీలక నేత నాగబాబు సైతం "పవన్ గెలుపు పిఠాపురం ప్రజలది, కల్యాణ్‌ది మాత్రమేనని, ఒకవేళ ఎవరైనా పవన్‌ను మేమే గెలిపించామంటే.. అది వారి ఖర్మ" అంటూ టీడీపీ మాజీ ఎమ్మెల్యే వర్మపై నోరు పారేసుకోవడంతో టీడీపీ నాయకుల కోపం నషాలానికెక్కినట్లు కనిపిస్తోంది. ఇక జనసేన సోషల్ మీడియా కార్యకర్తలు సైతం ఇదే తరహాలో రెచ్చిపోవడంతో టీడీపీ నుంచి కౌంటర్లు ప్రారంభమయ్యాయి.

### పోనీలే అని చేరదీస్తే,
### చావు తెలివితేటలు చూపిస్తారా..

పదేళ్లుగా కనీసం తమ అధ్యక్షుడిని గెలుపించుకోలేని పార్టీ, ఎప్పుడు ఎవరిపక్షన ఉంటుందో తెలియని పార్టీ, ఎన్నికల తర్వాత కనిపిస్తుందో.. కనుమరుగవుతుందో అన్న చందంగా తయారైన పార్టీ మమ్మల్ని గెలిపించడమా..? పోనీ అని చనువిస్తే చంకనెక్కాన్న రీతిలో కూటమిలో చోటిచ్చి గెలుపు రుచి చూపిస్తే.. మాపైనే పెత్తనం చెలాయించే రీతిలో మాట్లాడుతారా..? అంటూ టీడీపీ నాయకులు జనసేనపై ఎదురుదాడికి దిగుతున్నారు. ఇక కొందరు టీడీపీ ఎంపీలు ఎవరో రాసిచ్చిన స్క్రిప్టును పవన్ చదివి వెళ్లిపోయారంటూ సెటైర్లు వేశారు. అలాగే లోకేష్‌ను డిప్యూటీ సీఎం చేయాలని తాము కోరుకుంటే అడ్డు తగిలి నిలిపివేయడమే కాకుండా ఇప్పుడు వారిపైనే మేం ఆధారపడినట్లు అడ్డగోలుగా మాట్లాడడం వారి అవివేకానికి నిదర్శనమంటూ మండిపడ్డారు. ఇక చంద్రబాబు, లోకేష్ కూడా పవన్ వ్యాఖ్యలపై లోలోన మదనపడుతున్నట్లు సమాచారం. ఇప్పటికిప్పుడు పైకి కనిపించకున్నా అదును చూసి దెబ్బకొట్టడం ఖాయమనే ప్రచారం సాగుతోంది.

### బీజేపీ మేమున్నామంటూ..

ఇక సందట్లో సడేమియా అన్నట్లు భారతీయ జనతాపార్టీ నాయకులు సైతం గొప్పలు చెప్పుకునే రొచ్చులోకి చేరిపోయారు. శ్రీ మోదీ ఆశీర్వాదం, కమలం కనికరమే లేకుంటే అసలు టీడీపీ, జనసేనకు అధికారం అనే మాటే వినిపించేది కాదని, సామదాన బేధ దండోపాయాలతో కూటమిని గెలుపు తీరాలకు చేర్చింది తామేనని ఆ పార్టీ నాయకులు చెప్పుకుంటుండడం గమనార్హం.

### మేనిఫెస్టో అమలు మా బాధ్యత అనే
### పార్టీ ఏది.. నాయకులెవరు..?

మే తోపులం.. మేం తురుమలం అనే పేర్లతో కూటమి గెలుపు తలుపు తట్టడానికి తామంటే తామే కారణమని చెప్పుకుంటున్న కూటమి పార్టీలు, మేనిఫెస్టో అమలుపై మాత్రం మీనమేషాలు లెక్కపెడుతుండడం గమనార్హం. సూపర్ సిక్స్ హామీలు, సూపర్ సెవెన్ హామీలు అంటూ అధికారంలోకి వచ్చిన పార్టీలు వాస్తవంలో తమ గెలుపునకు కారణమైన ప్రజలను విస్మరించి, సొంతడబ్బాకు పరిమితమవడం ఎంతవరకు సమంజసం అనే వాదనలు తెరపైకి వస్తున్నాయి. సమిష్టి విజయాన్ని సొంత గెలుపుగా చెప్పుకుంటున్న నాయకులు సంక్షేమపథకాలు, అప్పులు, హామీలపై మాత్రం అదిగో ఇదిగో అంటూ తాత్సారం చేయడం ఏంటనే ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. ఏ పార్టీకి అయినా ప్రజలే దేవుళ్లని, వారిని వదిలిపెట్టి తమలో తాము కలహించుకోవడం, వాగ్దానాల అమలుపై కల్లబొల్లిమాటలతో నెలల తరబడి మభ్య పెట్టడం తగదని రాజకీయ నిపుణులు సైతం హితవు పలుకుతున్నారు.

ఇకనైనా మాటలు కాదు, చేతల్లో పస చూపించాలని హితబోధ చేస్తున్నారు. సీట్లు, సెటైర్లు అన్నీ ఎన్నికలకే పరిమితం కావాలని, తర్వాత ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా, హామీలను నెరవేర్చడమే లక్ష్యంగా పనిచేయాలని సూచిస్తున్నారు.

మొత్తంమీద ఆంధ్రాలో టీడీపీ, జనసేన, బీజేపీ మధ్య నడుస్తున్న మూడుముక్కలాట రాష్ట్ర రాజకీయాలలో అనిశ్చితికి అద్దంపడుతుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రగల్భాలు మాని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలలో తమ ప్రతాపం చూపాలని సూచిస్తున్నారు..!

# జన్మభూమిలో సతీష్ సేవలు భేష్!

## • మెచ్చుకున్న మంత్రి ఆనం



రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, ప్రముఖ శాస్త్రవేత్త డా. గుండ్రా సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో, ఆయన స్వస్థలమైన ఆత్మకూరు నియోజకవర్గం మహిమలూరులో ఇటీవల మెగా ఉచిత ఆరోగ్య వైద్య శిబిరం నిర్వహించారు. సతీష్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆనంద్‌లతో కలసి రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఈ శిబిరానికి ప్రారంభోత్సవం చేశారు. ఆనం మాట్లాడుతూ, సతీష్‌రెడ్డి వంటి శాస్త్రవేత్త, సేవాభావం గల వ్యక్తి.. మహిమలూరులో జన్మించడం ఈ ప్రాంత ప్రజల అదృష్ట మన్నారు. జన్మభూమికి సేవచేయాలనే తలంపుతో తన సొంత గ్రామం మహిమలూరులో పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన సేవాతత్పరుడు సతీష్‌రెడ్డి అని ప్రశంసించారు. సతీష్‌రెడ్డి సేవలను గుర్తించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా ఆయన్ను నియమించడం సంతోషకరమంటూ సతీష్‌రెడ్డికి మంత్రి ఆనం అభినందనలు తెలిపారు. అనంతరం, ఆ వైద్య శిబిరంలో స్కానింగ్ కేంద్రం, స్విమ్స్ వారు ఏర్పాటు చేసిన మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ యూనిట్‌ను మంత్రి ప్రారంభించారు. వైద్య శిబిరంలో అన్ని విభాగాలను సందర్శించి రోగులకు అందిస్తున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. సిమ్స్ ఆసుపత్రి వారు పంపిన మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను మహిళలందరూ తప్పకుండా చేయించుకోవాలని, ప్రాథమిక స్థాయిలోనే క్యాన్సర్‌ను గుర్తిస్తే తగు చికిత్సల ద్వారా ఆ వ్యాధి బారినుంచి బయటపడవచ్చని ఆయన తెలిపారు. త్వరలోనే జిల్లాలో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలకోసం ఒక మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వాహనాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. వైద్యరంగంలో ఖ్యాతి గడించిన అపోలో వైద్యులు, సాంకేతిక నిపుణులు ఎందరో సేవలందిస్తున్న ఈ మెగా వైద్యశిబిరంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వైద్యపరీక్షలు చేయించుకుని మెరుగైన ఆరోగ్యంతో జీవించాలని మంత్రి ఆనం ఆకాంక్షించారు.

# కొత్త రైల్వే ప్రాజెక్టులు కేటాయించారా?

## - లోక్‌సభలో ప్రశ్నించిన ఎంపీ విపిఆర్



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రైల్వేల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వివరించాలని లోక్‌సభలో బుధవారం నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కోరారు. రాష్ట్రంలో ప్రతిపాదించిన, నిర్మాణంలో ఉన్న రైల్వే ప్రాజెక్టుల వివరాలు, ప్రస్తుతం వాటి స్థితిని తెలియజేయాలని అడుగుతూ, రాష్ట్రంలో కొత్త రైల్వేలైన్లను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం వద్ద ప్రణాళికలు ఏమైనా ఉన్నాయా అని ప్రశ్నించారు. అందుకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వనీ వైష్టవ్ సమాధానమిస్తూ, రైల్వే ప్రాజెక్టుల కేటాయింపు జోన్ల వారీగా ఉంటుందన్నారు. రైల్వే జోన్ల వారీగా ప్రాజెక్టుల వివరాలు, వాటి ఖర్చు భారతీయ రైల్వే వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా 2024 ఏప్రిల్ నాటికి, మొత్తం 5,329 కి.మీ పొడవును కవర్ చేస్తూ, 73,743 కోట్ల విలువైన 41 రైల్వే ప్రాజెక్టులు (17 కొత్త లైన్లు మరియు 24 డబ్లింగ్) అమలుదశలో ఉన్నాయన్నారు. వీటిల్లో 1006 కి.మీల పొడవున 24,150 కోట్ల విలువైన పనులు ఇప్పటికే పూర్తయ్యాయని చెప్పారు. అలాగే 6764కి.మీ గల 65సర్వేలు(13 కొత్తలైన్ మరియు 52డబ్లింగ్) గత మూడు సంవత్సరాలలో మరియు ప్రస్తుత సంవత్సరం 2024-25లో ఆంధ్రప్రదేశ్‌కి కేటాయించినట్లు చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2009-2014 మధ్య రైల్వేలకు సంవత్సరానికి రూ.886 కోట్లు కేటాయిస్తే.. 2025-26 సంవత్సరానికే ఆంధ్రప్రదేశ్‌కి రూ.9417 కోట్ల విలువైన ప్రాజెక్టుకు కేటాయించామన్నారు.

# చెప్పినవి చెప్పినట్లు చేస్తున్నాం..

## - రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి



నెల్లూరు రూరల్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల జాతరలో భాగంగా, ఈ నెల 3వ తేది గురువారం నాడు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీఎత్తున సీసీరోడ్లు, డ్రైన్ల పనులకు శంకుస్థాపనలు జరిగాయి. దాదాపు 29 లక్షల రూపాయల వ్యయంతో జరిగే ఈ పనులకు ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఆయనతో పాటు ఆయన సోదరుడు.. టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రూరల్‌లో కోట్లాదిరూపాయల వ్యయంతో అభివృద్ధిపనులు జరుగుతున్నాయని, చెప్పిన మాట ప్రకారం ఆ పనులన్నీ త్వరలోనే పూర్తిచేయిస్తామని చెప్పారు. అన్ని పనులను సకాలంలోనే చేసి చూపిస్తామన్నారు. ఆ పనుల నాణ్యత ప్రమాణాల విషయంలో కూడా ఎట్టిపరిస్థితుల్లోనూ రాజీపడేది లేదన్నారు. ప్రత్యేకించి నాణ్యతా ప్రమాణాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ఇప్పటికే పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని, అందుకు సహకరిస్తున్న అధికారులకు, కాంట్రాక్టర్లకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. డివిజన్ పరిధిలో కొన్ని సమస్యలను స్థానిక ప్రజలు తన దృష్టికి తీసుకుని వచ్చారని, వాటిని కూడా పరిశీలించి త్వరితగతిన పరిష్కరిస్తామని ఆయన చెప్పారు. స్థానిక కార్పొరేటర్ కువ్వాకొల్లు విజయలక్ష్మి, డివిజన్ అధ్యక్షులు పాలూరు నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# చిల్డ్రన్స్ పార్కును అభివృద్ధి చేస్తాం

## - కమిషనర్ సూర్యతేజ



నెల్లూరులోని చిల్డ్రన్స్‌పార్కులో అవసరమైన వసతులు కల్పించి, చిన్నపిల్లలు -పెద్దలు అందరూ ఆహ్లాదించే విధంగా తీర్చిదిద్దేందుకు నగర పాలక సంస్థ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈనెల 2న కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ ఆ పార్కును సందర్శించి, పార్కు అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను సంబంధిత అధికారులతో చర్చించారు. పిల్లలకు కావాల్సిన ఆటవస్తువులను సమకూరుస్తామని, మహిళల కోసం ప్రత్యేకంగా వ్యాయామ పరికరాలు, షటిల్ తదితర క్రీడల్లో రాణించేందుకు వీలుగా పార్కును రూపుదిద్దుతామన్నారు. ఈ సందర్భంగా ఆయన వెంట కార్పొరేషన్ ఇంజనీరింగ్ ఎస్ఇ రామ్మోహన్‌రావు, ఇఇ శేషగిరిరావు, ఉద్యానశాఖ ఏ.డీ ప్రదీప్‌కుమార్, పశువైద్యులు డాక్టర్ మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# వీనులవిందుగా.. భాగవత సప్తాహం!




నెల్లూరు నవాబుపేటలోని ప్రసిద్ధమైన ద్రౌపదీ సమేత శ్రీకృష్ణ ధర్మరాజస్వామి దేవాలయంలో మార్చి 30 నుంచి వసంత నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఏప్రిల్ 6వ తేదీ వరకు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజు సాయంత్రం 6.30 గంటల నుంచి ప్రముఖ అవధాని, విశ్రాంత సంస్కృతోపన్యాసకులు.. సంపూర్ణ వాల్మీకి రామాయణం శ్లోకాల ఆడియోకర్త.. కోట రాజశేఖర్ భాగవత సప్తాహాన్ని వీనులవిందుగా నిర్వహిస్తున్నారు. భాగవతప్రాశస్త్యం గురించి, పోతన మహాకవి వైశిష్ట్యాన్ని గురించి, భాగవతంలోని పలు ఘట్టాలను ఒక్కోరోజు ఒక్కో విశేషాంశంగా తన ప్రవచనాల్లో ఆయన అద్భుతంగా వివరిస్తున్నారు. ఇప్పటికే అంబరీషుని చరిత్రను, ప్రహ్లాద చరిత్ర-నృసింహస్వామి ఆవిర్భావ ఘట్టం, గజేంద్రమోక్షం, శ్రీకృష్ణ జననం, బాల్య జీవనం, రుక్మిణీ కల్యాణం, శ్రీకృష్ణావతారంలోని విశేషాంశాలు వగైరాలన్నిటినీ విశదీకరించి ఆలయ నిర్వాహకుల సన్మానం అందుకున్నారు. ఆలయ వంశస్తులు సాదా నాగేంద్ర, ఆలయ అభివృద్ధికి కారకులు కంచి జ్ఞానేంద్రసాయి, స్వామి సమయానందనాథ, మల్లవరపు లక్ష్మీనరసింహశర్మ, బ్రహ్మశ్రీ గుండాపంతుల రామసుబ్రహ్మణ్యంశర్మ తదితరుల ఆధ్వర్యంలో ఆలయంలో పూజాదికాలు, ఉత్సవాలు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. ఏప్రిల్ 6న శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా ఆరోజు ఉదయం 10 గంటల నుంచి శ్రీ సీతారాముల కల్యాణోత్సవం మరింత నయనానందకరంగా జరుగుతుందని, అవధాని కోట రాజశేఖర్ ఆ ఉత్సవానికి వ్యాఖ్యాతగా వ్యవహరిస్తారని ఆలయ నిర్వాహకులు ఈ సందర్భంగా చెప్పారు. భక్తులందరూ తరలివచ్చి శ్రీ సీతారాముల కృపాకటాక్షాలు పొందాలని వారు విజ్ఞప్తి చేశారు. కల్యాణోత్సవం అనంతరం భక్తులందరికీ అన్నసంతర్పణ కూడా ఉంటుందని తెలియజేశారు.

# 'ఆటిజం'పై అవగాహన పెరగాలి

## ప్రముఖ సైకియాట్రిస్ట్ డాక్టర్ పీవీ రెడ్డి



'ఆటిజం'పై ప్రజల్లోను, చిన్నారుల తల్లితండ్రుల్లోనూ మరింతగా అవగాహన పెరగాలని ప్రముఖ సైకియాట్రిస్ట్ డాక్టర్ పీవీ రెడ్డి చెప్పారు. ఏప్రిల్ 2..'ప్రపంచ ఆటిజం డే' సందర్భంగా నెలూరు రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలోని ఎమ్మెస్సార్ స్పాస్టిక్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పిల్లల్లో తరచూ వస్తున్న ఆటిజం సమస్యను ప్రాథమిక స్థాయిలోనే వెంటనే గుర్తించి, తగు చిక్సిలు చేయించాలని సూచించారు. ఆటిజం నరాలకు సంబంధించి వచ్చే సమస్య అని, దీని నివారణకు మందులు లేవని అంటూ, కేవలం ఫిట్స్ వచ్చే కొంతమంది చిన్నారులలో ఫిట్స్‌ని అదుపులో పెట్టడానికి మాత్రమే మందులున్నాయని, థెరపీ ద్వారా మాత్రమే ఆటిస్టిక్ చిన్నారులను వారి యొక్క ప్రవర్తనలో మార్పులు చేయగలమని తెలిపారు. రెడ్‌క్రాస్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు దాసరి రాజేంద్రప్రసాద్, స్పాస్టిక్ సెంటర్ ప్రిన్సిపాల్ గురునాథరావు తదితరులు పాల్గొన్నారు.

# పశువైద్యునికి..

## రాష్ట్రస్థాయి పురస్కారం



నెల్లూరు జిల్లా అనుమసముద్రంపేట పశువైద్యకేంద్రం వైద్యుడు షేక్ తాహా అన్సారీకి పశువైద్య రంగంలో విశిష్ట సేవలందిస్తున్నందుకు రాష్ట్రస్థాయి ఉత్తమ పశువైద్య పురస్కారం లభించింది. ఈనెల 2న విజయవాడలో జరిగిన కార్యక్రమంలో పశువైద్యశాఖ సంచాలకులు డాక్టర్ దామోదర్‌నాయుడు చేతులమీదుగా ఆయన ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా అన్సారీకి జిల్లాలోని పశువైద్యులు శుభాకాంక్షలు తెలిపారు.

లాయర్
ఏప్రిల్ 04, 2025

# 'మన్ కీ బాత్'లో మనకెన్నో.. మంచిమాటలు!

నేడు ప్రపంచవ్యాప్తంగా భయపెడుతున్న కాలుష్య వాతావరణం, ప్రకృతి విపత్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలంటూ, అందుకు అనుసరించాల్సిన వివిధరకాల పద్ధతులను కూడా సూచిస్తూ ప్రధాని మోడీ 'మన్ కీ బాత్'లో మనకెన్నో మంచిమాటలు చెప్తున్నారు. వాటిని మాటలు అనేకంటే, ఆణిముత్యాలని అనవచ్చు. ఒక దేశ ప్రధానిగా, గతంలో ఎప్పుడూ లేనివిధంగా, ప్రజల సంక్షేమం కోసం అలాంటి బృహత్తరమైన కార్యక్రమాన్ని ఆయన తరచూ నిర్వహిస్తుండడం విశేషం. వివిధ సందర్భాల్లో దేశప్రజలకు ప్రధాని తన సూచనలుగా ఇస్తున్న మార్గదర్శకాలు..చెప్తున్న మంచిమాటలు ప్రజలకు ఎంతో స్ఫూర్తిదాయకంగా దేశానికి మార్గదర్శకంగా ఉంటున్నాయి కూడా. ముఖ్యంగా, 'స్వచ్ఛభారత్' వంటి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం, తద్వారా నేటికీ దేశంలో అనేక ప్రాంతాల్లో ఈ కార్యక్రమాలు జరుగుతూనే ఉండడం తెలిసిందే. అనేక రకాల వ్యర్థాలతో పర్యావరణం బాగా దెబ్బతింటోన్న నేపథ్యంలో..కాలుష్యపు కోరలు తగలకుండా మన పరిసరాలనేకాదు..నదులు, సాగరతీరాలను కూడా రక్షించుకోవాలని, మనం తిని పారేసే వ్యర్థాలు వాటిని ముంచెత్తకుండా చూడాలని ప్రధాని సూచించడమే కాక, వాటిని ఆచరణాత్మకంగా తాను కూడా చేసి చూపించారు. చీపురుతో వీధులు ఊడ్వడం, సముద్రతీరాల్లో తన చేతులతోనే వ్యర్థాలను ఏరివేయడం వంటివి అందరికీ తెలిసిందే. ప్రకృతి మనకు వరంలా ప్రసాదించిన అనేకరకాల వనరులను మనమే చేజేతులా నాశనం చేసుకుంటున్నాం. మనకు ఆయువుపోసే ప్రకృతిని, పర్యావరణాన్ని కాపాడుకోలేకపోతున్నాం. ఫలితంగా తినే తిండి, తాగే నీరు, పీల్చే గాలి అన్నీ కలుషితమైపోతున్నాయి. వీటన్నిటికి విరుగుడుగా మొక్కలు నాటాలని, పచ్చదనాన్ని పెంచాలని ప్రధాని అనేకసార్లు చెప్తూనే ఉన్నారు కూడా. చిన్నారులు సైతం తమ 'అమ్మ పేరు'తో ఒక మొక్కను నాటాలంటూ ప్రధాని గతంలో 'మన్ కీ బాత్'లో ఇచ్చిన హృద్యమైన సందేశం చిన్నారి లోకాన్ని కూడా కదిలించిందంటే అతిశయోక్తి కాదు. దేశవ్యాప్తంగా అనేక పాఠశాలల్లోని పిల్లలు మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్విరామంగా నిర్వహిస్తూనే ఉన్నారు. ఏదైనాసరే, సమాజంలో ఒక మార్పు రావాలంటే ఒక చిన్న అడుగుతోనే ప్రారంభం అవుతుంది. చిన్న వాన చినుకే ఆ తర్వాత ప్రవాహమవుతుంది. ఆ విధంగా, అనేక మంచి కార్యక్రమాలు 'మన్ కీ బాత్' ద్వారా దేశ ప్రజలకు చేరువవుతున్నాయి. మన సంప్రదాయాలు, మన సంస్కృతి ప్రపంచవ్యాప్తంగా ఇప్పుడు బాగా ప్రఖ్యాతి చెందుతున్నాయి కూడా. ఇదంతా ప్రత్యేకించి ప్రధాని మోడీ చొరవతోనే సాధ్యమవుతున్నాయని అందరికీ తెలిసిందే. పాశ్చాత్య అలవాట్లకు లోనుకాకుండా సంప్రదాయబద్ధమైన ఆహారాన్ని తింటూ అందరూ ఆరోగ్యంగా ఉండాలని, పౌష్టికాహారం బాగా ఉండే చిరుధాన్యాలను వినియోగించుకోవాలని..ఇలా ఎన్నో సకలజన హితకరమైన సందేశాలను ప్రధాని ఇస్తూనే ఉన్నారు. తాజాగా మార్చి 30న 'మన్ కీ బాత్-120' వ కార్యక్రమంలో ఉగాది పండుగ ప్రాముఖ్యాన్ని ప్రధాని అద్భుతంగా వివరించారు. ఈ వేసవి సెలవులను చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని, పర్యావరణం-నాటకరంగం-నాయకత్వం వంటి అంశాలపై దృష్టి సారించి, అవసరమైతే వాటిలో శిక్షణ తీసుకోవాలని కూడా సూచించారు. ఈ వేసవిలో నీటిని పొదుపుగా వాడుకోవాలని, నీటి సంరక్షణకు శ్రద్ధ తీసుకోవాలని, ప్రతి నీటిబొట్టును ఒడిసిపట్టుకోవాలని ప్రధాని తన సందేశాన్నిచ్చారు. అంతేకాదు, దేశంలో వస్త్రాల వ్యర్థాలు కొత్త సమస్యలకు కారణమవుతున్నాయని చెప్తూ, వాటిలో ఒకశాతం మాత్రమే రీసైకిల్ అవుతున్నాయని తెలిపారు. ప్రపంచంలోనే అత్యధిక వస్త్ర వ్యర్థాలుండే దేశాల్లో మనం మూడవస్థానంలో ఉన్నామంటూ ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సరికొత్త సవాళ్ళను కూడా అధిగమించాల్సి ఉందని, పాత బూట్లు, పాత చెప్పులు, పాత దుస్తులను రీసైక్లింగ్ చేసి, అవి తిరిగి ఉపయోగపడేలా చేద్దామని చెప్పారు. యోగా ప్రాధాన్యతను గుర్తుచేస్తూ, ప్రపంచ మానవాళికే మన యోగా ఒక బహుమతి అని ఆయనన్నారు. అదేవిధంగా ధ్యానం, ఆయుర్వేదం వంటివి మానవాళికి వెలకట్టలేనంత ప్రయోజనాలను చేకూరుస్తాయని సూచించారు.

ఇలా.. ఆణిముత్యాల్లాంటి అనేక రకాల హితవచనాలతో ప్రధాని 'మన్ కీ బాత్' ప్రజల మనసులను బాగా ఆకట్టుకుంటుండడం శుభపరిణామం. కేవలం వాటిని వినడమే కాదు, వాటిని ఆదరించి..ఆ మంచిపనులను అందరూ మరింతగా ఆచరించి చూపినప్పుడే సత్ఫలితాలుంటాయి. దేశ క్షేమానికి, మనందరి ఆరోగ్య సౌభాగ్యాలకీ ఆ మాటలెంత దివ్యౌషధాలో మనకు ఆ తర్వాత అవగతమవుతాయి.




# భారమవుతున్న బాడుగెల్లు!

"టౌను పక్కకెళ్ళొద్దురా డింగరి....డాంబికాలు పోవొద్దురా...

టౌను పక్కకెళ్ళేను డొనైపోతావురో రబ్బీ బంగారుసామి"... అంటూ ఎప్పుడో 1957 నాటి 'తోడికోడళ్ళు' సినిమాలో పాట. నేటికీ మన పట్టణాలు, మహానగరాల్లోని పరిస్థితులకి అద్దం పడుతూనే ఉంది. టౌన్లలో బతకలేమని, అక్కడెవరూ ఎవరినీ పట్టించుకోరని, ఏం జరిగినా దిక్కుమొక్కూ ఉండదని పల్లెజనం ఇప్పటికీ అంటూనే ఉంటారు. అందులో వాస్తవం లేకపోలేదు. ఏ పల్లె నుంచో నగరానికి వెళ్ళి, అక్కడ బతకడానికి వాళ్ళు పడే బాధలు వర్ణనాతీతంగా ఉంటాయి. ఈ ఆధునిక కాలంలో, ప్రపంచీకరణ నేపథ్యంలో నగరాల రూపురేఖలే కాదు, వాటి తత్వం కూడా మారిపోయింది. జీవనవ్యవస్థలన్నీ క్రమేణా చిన్నాభిన్నమైపోతున్నాయి. ధనమే అన్నిటికీ ప్రాతిపదికగా మారిపోయింది. 'డబ్బుకు లోకం దాసోహం' అంటోంది. చేతినిండా పుష్కలంగా డబ్బు లేనిదే నగరాల్లో బతకలేని పరిస్థితి ఏర్పడింది. వేలకువేలు ధారపోస్తే తప్ప బాడుగిల్లు దొరకడం లేదు. దానికి తోడు పెద్దమొత్తాల్లో అడ్వాన్సులు చెల్లించాలి. దీంతో నగరాల్లో జీవనవ్యయం భరించలేనంత భారంగా తయారుకావడం, సగటు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల ఉద్యోగులకే కాదు, ఐటీ రంగ నిపుణులకు సైతం కళ్ళల్లో నీరు తెప్పిస్తోంది.

## బాబోయ్!..బాడుగలు...!

దేశంలోని అనేక ప్రధాన నగరాల్లో నానాటికీ పెరుగుతున్న ఇంటి బాడుగలు చెల్లింపుదారుల గుండెల్లో రైళ్ళు పరుగెత్తిస్తున్నాయి. మొదలే రోజువారీ ఖర్చులు, నెలసరి బిల్లులు, అన్నీ పోను సగటు జీతగాడి జేబుకి చిల్లు తప్ప, ఇతర ఆనందాలకి డబ్బు మిగలడం లేదు. కనీసం భార్యాపిల్లలతో కలసి నెలకోసారైనా సరదాగా ఓ సినిమాకి వెళ్దామన్నా, షికారుకు పోదామన్నా జేబులో డబ్బుంటే కదా!.. ఉన్నదంతా ఇంటి అద్దెలకి, ఇన్‌స్టాల్మెంట్లకి, ఇంటి ఖర్చులకే సరిపోతోంది. ముఖ్యంగా ముంబై, కలకత్తా, ఢిల్లీ, బెంగుళూరు, హైదరాబాద్, చెన్నై, పూణే, అహ్మదాబాద్ వంటి నగరాలలో అద్దె ఖర్చులు భారీగా పెరిగిపోతున్నాయంటూ, అధిక జీతాలుండే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లే అల్లాడిపోతున్నారు. దేశంలోనే అత్యధిక అద్దెలు ముంబైలో ఉంటే, ఆ దారిలో ఇప్పుడు బెంగుళూరు, హైదరాబాద్, చెన్నైలు తయారవుతున్నాయి. వెయ్యి చదరపు అడుగుల 2 బెడ్ రూములున్న ఫ్లాట్‌కి కనీసపు అద్దె 50వేలు దాటిందంటే అతిశయోక్తి కాదు.

## పెరిగే డిమాండు కొద్దీ పెరుగుతున్న బాడుగలు..!

మనదేశంలోని పలు నగరాల్లో బహుళజాతి కంపెనీలు పెద్దసంఖ్యలో తమ శాఖలను నెలకొల్పుతుండడం, వాటిలో ఉద్యోగాల కోసం అధిక సంఖ్యలో, యువత నగరాలకు తరలి వస్తుండడంతో.. ఇదే అదనుగా ఆయా రాష్ట్రాల్లో ఇళ్ళ యజమానులు తమ ఇష్టానుసారం బాడుగలు పెంచేస్తుండడం సర్వసాధారణమైపోయింది. నగరాల్లో నివాసం ఉండడానికి వసతుండే పీజీలు, ఇతరత్రా నివాస ప్రాంతాలన్నీ ఎప్పుడూ కిటకిటలాడుతుంటాయి. బాడుగిళ్ళని వెతికిపెట్టే ఏజెంట్లది పెద్ద వ్యాపార వ్యవస్థగా అవతరించిందంటే ఇక ఏ స్థాయిలో అద్దె నివాసాలకి డిమాండ్ వుందో ఊహించుకోవచ్చు. ఇల్లో, రూమో వెతికిపెడితే ఒక నెల బాడుగ కమీషన్ రూపంలో ఏజంటుకి చెల్లించాలి. ఇవన్నీ అద్దె చెల్లింపుదారులకి చిల్లుపెట్టే అంశాలే. అంతేకాదు, అద్దెలు పెంచే వ్యూహాల్లో భాగంగా యజమానులు లీజు వ్యవధిని కూడా బాగా తగ్గిస్తుండడంతో, బాడుగ ఇళ్ళల్లో ఉండేవాళ్ళ కష్టాలు అంతా ఇంతా కాదు.

పెద్ద నగరాలలో సింగిల్ బెడ్‌రూమ్ అపార్ట్‌మెంట్ లేదా పోర్షన్ కావాలంటే కనీసం నెలకి 15 నుండి 20 వేల దాకా చెల్లించాల్సిందే. అదే డబుల్ బెడ్‌రూమ్ అయితే 25వేల నుండి 50వేల వరకూ ఉంటుంది. ఇక త్రిబుల్ బెడ్‌రూమ్ ఇంటి గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. మనం నివసించడానికి ఎంపిక చేసుకునే ప్రాంతాన్ని బట్టి రెంటు చెల్లించాలి. అది 45వేలతో మొదలై 65 వెలవరకూ కూడా ఉంటుంది. ఉద్యోగస్తుడైతే తనకొచ్చే జీతం, వ్యాపారస్తుడయితే వారి వ్యాపార స్థాయిని బట్టి వాళ్ళు ఉండే ఇంటి ప్రాంతం, సైజు నిర్ణయించుకుంటారు. బాడుగులకి పెరగడమే తప్ప తరగడం తెలియదు. భవిష్యత్తులో ఈ అద్దెలిక తగ్గేదే ఉండదని, వచ్చేఏడాదికి కనీసం 6.5శాతానికి పైగానే పెరగవచ్చని కూడా నిపుణులు అంచనా వేస్తున్నారు.

## వ్యవస్థల లోపమే శాపం

మనదేశంలో బాగా అభివృద్ధి చెందుతున్న నగరాలలో ముంబై, ఢిల్లీ, కలకత్తా, పూణే, బెంగుళూరు, మంగళూరు, కొచ్చిన్, చెన్నై, హైదరాబాద్, అహ్మదాబాద్ వంటివి కొన్ని ప్రధానమైనవి. ఈ మహానగరాల్లో ఆస్తులు కొనడం అన్నది సామాన్యులకు అలివయ్యే పని కాదు. కోట్లకు పడగలెత్తినవారికే అది సాధ్యమవుతుంది. కాబట్టి అధికశాతం మంది నెల బాడుగులపై ఆధారపడవలసిందే. అద్దె భవనాలలో నివసించే వారికి ఎన్ని ఇబ్బందులు వుంటాయో, అదే సమయంలో తమ భవనాలని బాడుగకు ఇచ్చే వాళ్ళ కష్టాలు కూడా వర్ణనాతీతమే.

అటు బాడుగ చెల్లింపుదారులు, ఇటు ఇళ్ళ యజమానులు ఇద్దరికీ న్యాయం జరిగేలా పరిస్థితులు మారాలి. అందుకోసం ప్రభుత్వాలు కూడా దృష్టిపెట్టాలి. ఈ అద్దె సముదాయాల వ్యవస్థ కోసం నియమనిబంధనలతో కూడిన ప్రత్యేక చట్టం తేవాలి. బాడుగ కట్టే వారికి, తీసుకునేవారికి సమన్వయకర్తగా వ్యవహరించేలా కొత్త వ్యవస్థకి రూపకల్పన చేయాలి. ప్రభుత్వ రంగ అధీనంలో ఈ వ్యవస్థ పనిచేసేలా చర్యలు తీసుకోవాలి. మధ్య తరగతి, దిగువ మధ్యతరగతి ప్రజలకి అందుబాటులో ఉండేలా 'బాడుగ'చట్టాన్ని ఆవిష్కరించాలి. భవనం వుండే ప్రాంతం, నిర్మాణ విస్తీర్ణాన్ని బట్టి ఇంటి పన్ను వసూలు చేస్తున్నారు. అదే తరహాలో భవనం వుండే ప్రదేశం, నిర్మాణ సైజుని బట్టి ప్రభుత్వమే అద్దెలు నిర్ణయించాలి. అంతకుమించి వసూలు చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకునేలా నిబంధనలు విధించాలి. సామాన్యులకి అందుబాటులో ఉండేలా బాడుగలకి పగ్గాలు వేయాలి..!

**- రాజశ్రీ**

# ఉత్తర-దక్షిణ యుద్ధానికి దారితీస్తున్న 'ఢీ' లిమిటేషన్!

నియోజకవర్గాల పునర్విభజన అంశం చిలికి చిలికి గాలివానగా మారుతోంది. ఉత్తర- దక్షిణ యుద్ధానికి దారితీసేలా పరిస్థితులు మారుతున్నాయి. డీలిమిటేషన్ వ్యవహారంలో కొన్ని చిన్న రాష్ట్రాల మద్దతుతో కేంద్ర ప్రభుత్వంతో 'ఢీ' కొనడానికి ప్రధాన దక్షిణాది రాష్ట్రాలు సంసిద్ధమవుతున్నాయి. ఉత్తరాది రాష్ట్రాల ప్రజలని పందులతో పోలుస్తూ దక్షిణాది నాయకులు చేస్తున్న కామెంట్లు వివాదాస్పదమవుతున్నాయి. రాజకీయ పార్టీల స్వప్రయోజనాల కోసం భాష పేరుతో ఉద్యమాలకి పిలుపునిస్తున్నాయి. ప్రాంతీయ భావోద్వేగాలని రెచ్చగొడుతున్నాయి. పరిస్థితులు తీవ్రస్థాయికి చేరకముందే కేంద్ర పెద్దలు జోక్యం చేసుకుని ఈ సమస్యకి సామరస్య పరిష్కారం చూపకపోతే ప్రాంతీయ విభేదాలు వచ్చే అవకాశం వుంది. తమ స్వార్థం కోసం వెర్రి జనాన్ని బలిచేయడం మన రాజకీయ నాయకులకి వెన్నతో పెట్టిన విద్య. ఓటరు మహాశయా తస్మాత్ జాగ్రత్త!

**డి. హరిత - గూడూరు.**

# ఆలోచన బాగుంది... ఆచరణ సాధ్యమైతే ఇంకా బాగుంటుంది!

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గత వారం నిర్వహించిన కలెక్టర్ల సమావేశంలో సీఎం చంద్రబాబు చేసిన సూచనలు బాగున్నాయి. జిల్లా కలెక్టర్లు అహం తగ్గించుకోవాలని సున్నితంగా సూచించారు. దర్పం ప్రదర్శించవద్దని మెత్తగా మందలించారు. ఛాంబర్‌లకి పరిమితం కాకుండా జనం మధ్యకి వెళ్లాలన్నారు. ప్రజల కష్టాలు గమనించడానికి పల్లె నిద్రలు చేయాలని కోరారు. దీర్ఘకాలంగా పరిష్కారానికి నోచుకోని సమస్యలకి తక్షణ పరిష్కారం చూపాలని ఆదేశించారు. అధికారులు ప్రజల వద్దకి వెళ్ళినప్పుడు సామాన్య జనం వారి దృష్టికి తెచ్చిన చిన్నచిన్న సమస్యలని త్వరితగతిన తీర్చాలని సూచించారు. తాను ముఖ్యమంత్రిగా రాష్ట్రం కోసం తపించినట్లుగా, జిల్లా కలెక్టర్లు జిల్లాల అభివృద్ధికోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి చేసిన సూచనలు, ఇచ్చిన సలహాలు బాగున్నాయి. ఆయన ఆలోచన కూడా అమోఘం. ఆచరణ సాధ్యమైతే అదో అద్భుతమే అవుతుంది.

**- జీ.వీ.సుబ్బయ్య, పిడుగురాళ్ళ.**

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

# రోడ్డు వేశారు... వీధి లైట్లు కూడా ఏర్పాటు చేస్తే బాగుంటుంది!

నెల్లూరు నగరం నుండి జాతీయ రహదారి దాటి కనుపర్తిపాడు కూడలి మీదుగా గొలగమూడికి వెళ్ళే రోడ్డుని తాజాగా ఆధునీకరించారు. ముఖ్యంగా వీపీఆర్ కళ్యాణమండపం దగ్గరనుండి ఒకే లైనుగా వున్న గొలగమూడి రహదారిని రెండు లైన్లుగా వెడల్పు చేసి విస్తరించారు. ఈ మార్గంలో వీధి లైట్లు కూడా ఏర్పాటు చేస్తే ప్రజలకి సౌకర్యవంతంగా ఉంటుంది. ముఖ్యంగా శని, ఆదివారాల్లో వందలాది మంది వెంకయ్యస్వామి భక్తులు కాలినడకన గొలగమూడికి వస్తుంటారు. చీకట్లోనే నడుచుకుంటూ ఆలయానికి చేరుకుంటుంటారు. ఇక్కడ వీధి లైట్లు ఏర్పాటు చేస్తే వాళ్లకి ఎంతో ఉపయోగకరం. నాయకులూ, అధికారులు చొరవ చూపాలి.

**ఆర్.పి.రామయ్య - కొండాయపాలెం.**

## ప్రభుత్వ ఉగాది సత్కారాలు...

# వెల్లివిరిసిన ఆనందోత్సాహాలు

కళారత్న(హంస) అవార్డులు


వేములపాటి మాధవరావు


దానం అంకయ్య


భోగాది రాయుడు


దోర్నాల హరిబాబు


కొల్లి అంకబాబు

వివిధ రంగాలలో సేవలందించిన నిష్ణాతులని ఉగాది పర్వదినం సందర్భంగా.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గుర్తించింది. కళారత్న (హంస) అవార్డులతోనూ, ఉగాది పురస్కారాలతోనూ వారిని సత్కరించింది. 86మందికి కళారత్న, 116 మందికి ఉగాది పురస్కారాలు వెరసి మొత్తం 202 మంది ఆయా రంగాలలో లబ్దప్రతిష్టులకి అందజేసింది. కళ, సంగీతం, సాహిత్యం, సామాజికసేవ, జర్నలిజం తదితర రంగాల నుండి వ్యక్తులని ఎంపికచేసి గౌరవించింది. మార్చి30 ఉగాది నాడు జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడే స్వయంగా అందరినీ సన్మానించి పురస్కారాలు ప్రదానం చేశారు. కొన్ని దశాబ్దాల కాలంగా ఆనవాయితీగా వస్తున్న ఈ అవార్డుల ప్రదాన సంప్రదాయాన్ని గత వైసీపీ ప్రభుత్వం అటకెక్కించింది. ప్రతిగా వైఎస్ఆర్ అవార్డుల పేరుతో తమ సొంత మనుషులని సత్కరించుకుంది. ఆరు సంవత్సరాల తరువాత కూటమి ప్రభుత్వం మళ్ళీ ఉగాది పురస్కారాలని అందించడంతో ఆయా రంగాలకి నిజమైన ఉగాది వచ్చిందని సత్కార గ్రహీతలు తమ ఆనందాన్ని వ్యక్తం చేయడం గమనార్హం.

### కొల్లి అంకబాబు

సీనియర్ జర్నలిస్టు కొల్లి అంకబాబుని ప్రభుత్వం కళారత్న (హంస) అవార్డుతో సన్మానించింది. ఈనాడు, ఉదయం తదితర పత్రికలలో పనిచేసిన అంకబాబు ప్రస్తుతం ఫ్రీలాన్స్ జర్నలిస్టుగా సామాజిక మాధ్యమంలో చురుకుగా పనిచేస్తున్నారు. దేశంలో, రాష్ట్రంలో ఏ మూల ఏం జరిగినా సామాజిక మాధ్యమం ద్వారా ఆయన సహచర పాత్రికేయులకు, తన ఆప్తులకి, మిత్రులకి, సమాజానికి క్షణాల్లో తెలియజేస్తారు. వయసు 7పదులు దాటినా రోజుకి 18 గంటలు వార్తలే వ్యాపకంగా చేసుకున్న ప్రతిభాశాలి అంకబాబు. ఆయన స్వస్థలం పాత నెల్లూరుజిల్లా కనిగిరి. మాగుంట కుటుంబంతో పాటు జిల్లాలో అనేకమంది ప్రముఖులతో ఆయనకి సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఈ సందర్భంగా ఆయన ముఖ్యమంత్రి సహాయనిధికి 2 లక్షల రూపాయల విరాళాన్ని అందించారు. విజయవాడలో విలయతాండవం చేసిన వరద బాధితుల సహాయార్థం గతంలో కూడా అంకబాబు ముఖ్యమంత్రి సహాయనిధికి 5లక్షల రూపాయల విరాళాన్ని అందించారు.

### భోగాది రాయుడు

"మనలోమాట" శీర్షిక ద్వారా 'లాయర్' పత్రికలో సుదీర్ఘకాలం అక్షర బాణాలు సంధించిన భోగాది వేంకటరాయుడు కూడా కళారత్న (హంస) అందుకున్నారు. భోగాది 1978 నుండి జర్నలిజంలో ఉన్నారు. ప్రధానంగా ఆంధ్రజ్యోతి, ఉదయం పత్రికలలో పనిచేశారు. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న తరుణంలో జలయజ్ఞంపై ముద్రించిన ప్రత్యేక సంచికకి సారధ్యం వహించారు. తన నలభైఏళ్ళ సుదీర్ఘ పాత్రికేయ అనుభవాలని క్రోడీకరించి "రాస్తూనే ఉందాం.." అన్న పేరుతో ఓ గ్రంథాన్ని రూపొందించి జర్నలిస్టు సమాజానికి దానిని అంకితంచేశారు. 'లాయర్'లో వచ్చిన "మనలోమాట"ని 101 వ్యాసాలతో పుస్తకీకరించారు. ఇప్పటికీ అనేక యూట్యూబ్ ఛానళ్ళలో రాయుడి ఇంటర్వ్యూలు వస్తుంటాయి. సామాజిక మాధ్యమం వేదికగా పలు పత్రికలలో వ్యాసాలు రాస్తూవుంటారు.

### వేములపాటి మాధవరావు

సమాజ సేవాభిలాషి వేములపాటి మాధవరావు స్వస్థలం ప్రకాశం జిల్లా అయినప్పటికీ నెల్లూరుజిల్లాతో అనుబంధం ఉంది. సోమశిల జలాశయం ఇన్వెస్టిగేషన్ ఇంజనీర్‌గా కూడా ఆయన పనిచేశారు. 40ఏళ్ల క్రితమే తన ఇంజనీరు ఉద్యోగానికి రాజీనామా చేసి, సమాజానికి సేవచేయాలనే లక్ష్యంతో మెజీషియన్‌గా రంగప్రవేశం చేశారు. నీటి పొదుపు, భూగర్భజలాల పరిరరక్షణ, డబ్బు పొదుపు ఇలాంటి అంశాలపై తన మ్యాజిక్ ప్రదర్శనలతో ఆకట్టుకుని, ప్రజలను చైతన్యవంతం చేసేవారు. ఆయన సమాజ సేవలను మెచ్చుకుంటూ రాష్ట్రప్రభుత్వం ఈ ఉగాదిరోజున ఆయన్ను 'కళారత్న' (హంస) అవార్డుతో సన్మానించింది.

### దోర్నాల హరిబాబు

రాష్ట్ర ప్రభుత్వం నుంచి కళారత్న(హంస)అవార్డునందుకున్న విశిష్ట కళాకారుల్లో నెల్లూరుకు చెందిన ప్రముఖ కళాకారుడు హాస్యనటుడు దోర్నాల హరిబాబు ఒకరు. గత 40 ఏళ్లుగా నాటక రంగంలో, అటు పౌరాణిక–ఇటు సాంఘిక నాటకాల్లో ఆయన విభిన్నపాత్రలను అద్భుతంగా పోషించి అందరి ప్రశంసలందుకున్నారు. నటనా రంగంలో ఆయన ప్రతిభాపాటవాలను గుర్తిస్తూ రాష్ట్ర ప్రభుత్వం 'శ్రీ విశ్వావసు' ఉగాది పర్వదినం రోజున 'కళారత్న' అవార్డును అందజేసి, సత్కరించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత మరియు సంస్కృతి సమితి ఆధ్వర్యంలో విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన ఉగాది ఉత్సవాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతులమీదుగా ఆయన ఆ అవార్డును అందుకున్నారు. రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, కందుల దుర్గేష్ తదితరులు దోర్నాలను అభినందించారు. కళారత్న అవార్డు గ్రహీతలకు అవార్డుతో పాటు 50వేల నగదు బహుమానాన్ని, జ్ఞాపికను కూడా అందజేశారు.

### దానం అంకయ్య

జానపద రీతిలో పంబలకథ చెప్పడంలో అద్వితీయ ప్రతిభ కలిగిన కళాకారుడు, ప్రత్యేకించి అంకమ్మతల్లి' కథ చెప్పడంలో సిద్ధహస్తుడు అయిన దానం అంకయ్యకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 'కళారత్న' (హంస) అవార్డునిచ్చి అభినందించారు. 89 ఏళ్ళ వయసున్న అంకయ్య కావలి మండలం చలంచర్ల గ్రామనివాసి. వాద్యబృందంతో కలసి, జిల్లాలోనే కాక, రాష్ట్రరాష్ట్రేతర ప్రాంతాల్లో వేలాది ప్రదర్శనలతో పంబల కథారీతిలో 'అంకమ్మతల్లి కథ'కు ఆయన ప్రాముఖ్యత తెచ్చారు. తెలుగులోని శక్తి వీరగాథా చక్రాలలో ప్రముఖమైన గ్రామశక్తి అంకమ్మ తల్లి కథను, ద్విపదలో 18 రాత్రుల పాటు అద్భుతంగా వినిపించే వారాయన. తరతరాల నాటి ఈ గాథను అద్భుతంగా చెప్పడంలో ఆయనకాయనే సాటి.

### ఉగాది పురస్కారాలు

కళారత్న అవార్డులతో పాటు వివిధ రంగాల్లో విశేషసేవలందిస్తున్న వారికి రాష్ట్ర ప్రభుత్వం ఉగాది పురస్కారాలను కూడా ప్రదానం చేసింది. ఈ పురస్కారాలతో పాటు రూ. 10వేల నగదు బహుమతులను కూడా ఇచ్చి సత్కరించింది. ఆ విశిష్ట పురస్కారాలను అందుకున్నవారిలో నెల్లూరు జిల్లాకు చెందిన పలవురు కళా–సంగీత, సాహితీరంగాల ప్రముఖులు కూడా ఉన్నారు. నెల్లూరుకు చెందిన ప్రముఖ కవి, రచయిత ఈతకోట సుబ్బారావు, ప్రముఖ సాహితీవేత్త డా. టేకుమళ్ళ వెంకటప్పయ్య, ప్రముఖ కవి..ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం డైరెక్టర్ డా. మాడభూషి సంపత్‌కుమార్‌లు సాహితీరంగంలో చేస్తున్న సేవలకు గుర్తింపుగా, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా ఉగాది పురస్కారాలు అందుకున్నారు. అదేవిధంగా, కర్నాటక సంగీతంలో నాదస్వర విద్వాన్‌గా రాణిస్తున్న సంగీత విద్వన్మణి ఓజిలి మునికుమారికి ఉగాది పురస్కారం


మద్దాళి రఘురాం


ఓజిలి మునికుమారి


డా. మాడభూషి సంపత్‌కుమార్


డా. టేకుమళ్ళ వెంకటప్పయ్య


ఈతకోట సుబ్బారావు

లభించింది. సామాజిక–సాంస్కృతిక సేవారంగంలో విశేష సేవలందిస్తున్న నెల్లూరుకు చెందిన ప్రముఖ కళాకారుడు, కిన్నెర ఆర్ట్స్ వ్యవస్థాపక కార్యదర్శి మద్దాళి రఘురాం ఉగాది పురస్కారాన్ని అందుకున్నారు. వీరంతా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతులమీదుగా ఈ పురస్కారాలను అందుకోవడం విశేషం. ఏదేమైనా, సాహిత్యానికి.. కళలకు పుట్టినిల్లయిన నెల్లూరుసీమలో పుట్టిన నెల్లూరీయులు తమ ప్రతిభను చాటుకుంటూ రాష్ట్రప్రభుత్వం నుంచి విశిష్ట అవార్డులందుకోవడం ఎంతైనా సంతోషదాయకం. వారందరికీ 'లాయర్' శుభాకాంక్షలు!....

## 'ఫ్రెండ్స్ వాకర్స్' ఆధ్వర్యంలో... ఉగాది సంబరాలు



'శ్రీ విశ్వావసు' నామ ఉగాది సందర్భంగా, మార్చి 30న నెల్లూరులోని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంబరాలు జరిగాయి. అసోసియేషన్ అధ్యక్షులు కిలారి శ్రీనివాసులునాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో, ప్రముఖ పండితులు రాఘవాచారి పంచాంగ శ్రవణం చేసి, రాశులు, నక్షత్రాల గురించి వివరించారు. ఉగాది విశిష్టత, ఉగాది పచ్చడి ప్రాశస్త్యాలను తెలియజెప్పారు. అనంతరం, వాకర్స్ సభ్యులందరికీ ఉగాది పచ్చడి, పులిహోర, గుగ్గిళ్ళు పంపిణీ చేశారు. సంప్రదాయ దుస్తులతో వచ్చిన వారందరినీ కండువాలతో సన్మానించారు. సభ్యులంతా కలసి రాఘవాచారిని ఘనంగా సత్కరించారు. అసోసియేషన్ కార్యదర్శి జి.నారాయణరెడ్డి, కోశాధికారి మాగంటి ప్రసాద్, 203 డిస్ట్రిక్ట్ ఎలెక్ట్ గవర్నర్ నలుబోలు బలరామయ్యనాయుడు, ఎస్కె నజీర్ అహమ్మద్, బెల్లం చెంచయ్య, కాగొల్లు శివయ్య, కె.వెంకటరమణ, బి.సదానందరెడ్డి, కొండూరు సుబ్బారావు, వినుకొండ వెంకటేశ్వర్లు, ఐ.సోను తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు కబుర్లు

## మన సంస్కృతి సంప్రదాయాలే.. భారతీయత

### హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతి మహాస్వామి



మన భారతదేశ గొప్ప సంస్కృతి సంప్రదాయాలు మన భారతీయతను చాటుతున్నాయని హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి అన్నారు. నెల్లూరులో సింహపురి ఉగాది ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన ఉగాది మహోత్సవంలో ఆయన పాల్గొని ప్రవచించారు. స్థానిక శివాజీ సెంటర్ శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానం-టీవీఎస్ కళ్యాణ్ సదన్ సంయుక్తంగా శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ప్రముఖ వేదపండితులు వేదగిరి ఫణిశర్మ పంచాంగశ్రవణం చేశారు. ప్రముఖ శాస్త్రవేత్త డా.జి.సతీష్‌రెడ్డి, ఆర్టీసీ రీజనల్ ఛైర్మెన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, ముఖ్య సమన్వయకర్త పి.సురేంద్రరెడ్డి, రెడ్ క్రాస్ ఛైర్మెన్ వాకాటి విజయకుమార్‌రెడ్డి, డాక్టర సర్వేపల్లి అజయ్‌కుమార్, చల్లా పెంచలరెడ్డి, గంటా రమణయ్య, ప్రభాకర్‌రాజు పర్యవేక్షించారు. సింహపురి ఉగాది ఉత్సవ సమితి అధ్యక్షులు బి ఎస్ రంగరాజన్, ప్రధాన కార్యదర్శులు వి.హర్షవర్ధన్, ఎన్.జగన్ మోహన్, పి.సత్యనాగేశ్వరరావు, కేవీ సుబ్రహ్మణ్యం, డాక్టర్ కే, వెన్నెల, జయప్రద, కే.భాస్కర్‌రావు, ఆమంచర్ల ప్రభాకర్, వాసుదేవరావు, కామేశ్వర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఉద్యోగులకు వైద్యసేవలు

ఆర్టీసీ ఉద్యోగులకు స్థానిక నారాయణ మెడికల్ కళాశాల వారి ఆధ్వర్యంలో ఈనెల 1న ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేసి వైద్యపరీక్షలు చేశారు. వారికి అవసరమైన ఆరోగ్యసలహాలిచ్చారు. ఆర్టీసీ జోనల్ ఛైర్మెన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి ఈ శిబిరానికి ప్రారంభోత్సవం చేశారు. టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, ఆర్టీసీ జోనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నాగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో రంజాన్



పవిత్రమైన రంజాన్ పర్వదిన వేడుకలను జిల్లావ్యాప్తంగా ముస్లిమ్ సోదరులు మార్చి 31న భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. అన్ని దర్గాలు, ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసుకుని, ఒకరికొకరు సంతోషంగా రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. నెల్లూరు నగరంలోని మసీదులు, దర్గాలన్నీ పండుగ కళను సంతరించుకున్నాయి. దైవభక్తితో, సత్ప్రవర్తనతో ఉంటూ సమాజంలో అందరూ సంతోషంగా, శాంతియుతంగా జీవించాలని మతపెద్దలు రంజాన్ సందేశాన్నిచ్చారు. రంజాన్ సందర్భంగా అనేకమంది దానధర్మాలు, సమాజసేవా కార్యక్రమాలు నిర్వహించారు.

# మైనార్టీల సంక్షేమం.. ప్రభుత్వ ధ్యేయం!

### - మంత్రులు ఆనం, పొంగూరు



రాష్ట్రంలో ముస్లిమ్ మైనార్టీ సోదరుల కుటుంబాల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణ చెప్పారు. సామాజిక సంక్షేమ పథకాలు, విద్య, ఉపాధి అవకాశాల్లో ముస్లిం సోదరులకు మెరుగైన అవకాశాలు అందించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. రంజాన్ పర్వదినం సందర్భంగా వారు ఇటీవల నెల్లూరు నగరంలోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మెన్ అబ్దుల్‌అజీజ్, నెల్లూరు రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, జిల్లా కలెక్టర్ ఆనంద్, మున్సిపల్ కమిషనర్ సూర్య తేజ, నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నాయకులు రూప్‌కుమార్‌యాదవ్, స్థానిక ప్రజా ప్రతినిధులు, ముస్లిం మత పెద్దలతో కలిసి వారు ఇఫ్తార్ విందు స్వీకరించారు. మంత్రి ఆనం మాట్లాడుతూ, రంజాన్ మాసంలో అనేక కార్యక్రమాలను తెలుగుదేశం పార్టీ హయాంలో, చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మైనార్టీ సోదరులకు అందించడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇమామ్ మరియు మౌజాన్లకు గౌరవ వేతనం కూడా ఇస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో 441 మసీదులకు రూ. 3.96కోట్లు నిధులు మంజూరుచేశామని, 882మంది ముస్లిం పండితులకు 66.15 గౌరవ వేతనాలు అందించినట్లు చెప్పారు. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ మాట్లాడుతూ, ముస్లిం మైనార్టీలకు టీడీపీ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాసరావు, ఇ.డి హైఫా, సూపరింటెండెంట్ రఘు పాల్గొన్నారు.




## ఎండల్లో అప్రమత్తంగా ఉండాలి

### అధికారులకు కలెక్టర్ ఆదేశం

జిల్లాలో వేసవి తీవ్రత అంతకంతకూ పెరుగుతున్న దృష్ట్యా, ఈ మండేఎండల్లో అధికారులు అప్రమత్తంగా ఉంటూ, ప్రజలకు ఇబ్బంది లేకుండా తగు చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా ప్రజలు కూడా ఎండల బారినపడకుండా జాగ్రత్తగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ సూచించారు.. ఈనెల 1న కలెక్టర్ చాంబర్‌లో, రాష్ట్ర విపత్తుల సంస్థ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని ఆసుపత్రుల్లో, 108 వాహనాల్లో ఐస్‌ప్యాక్‌లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఉపాధి హామీ పనులు చేసే కూలీలకు తాగునీరు, ఓఆర్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచాలని, ఆర్టీసీ బస్టాండ్‌లలో ప్రయాణీకుల సౌకర్యార్థం చలివేంద్రలు ఏర్పాటుచేయాలని సూచించారు. వేసవితీవ్రత పట్ల ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. గ్రామాల్లో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. అనంతరం వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రూపొందించిన బ్యానర్‌ను ఆవిష్కరించారు. డీఆర్వో ఉదయభాస్కర్‌రావు, జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుజాత తదితర అధికారులు పాల్గొన్నారు.

## కవులకు ఉగాది పురస్కారాలు

శ్రీ విశ్వావసు నామ ఉగాది సందర్భంగా నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో కవి సమ్మేళనం జరిగింది. జిల్లా కలెక్టర్ ఆనంద్, జాయింట్ కలెక్టర్ కార్తీక్ పాల్గొని కవులకు ఉగాది పురస్కారాలు అందజేశారు. జిల్లాలోని పలువురు కవులు తమ కవితలతో ఆహూతులను అలరించారు. కవయిత్రులు గోవిందరాజు సుభద్రాదేవి, పాతూరు అన్నపూర్ణ, తోట సులోచన, ములుగు లక్ష్మీ మైథిలి, కవులు అవ్వారు శ్రీధర్‌బాబు, మోపూరు పెంచలనరసింహం, గుండాల నరేంద్రబాబు, నరసింహమూర్తి, సుధీర్‌కుమార్, అలెగ్జాండర్, మాటేటి రత్నప్రసాద్‌ల కవితాగానం అందరినీ అలరించింది. అనంతరం కవులు-కవయిత్రులను కలెక్టర్ సన్మానించారు.

## రజకుల సమస్యలు తీర్చాలి

రజకులు ఎంతోకాలంగా సమస్యలతో సతమతమవుతున్నారని, ప్రభుత్వం శ్రద్ధ తీసుకుని ఆ కష్టాలను తీర్చాలని జిల్లా రజక వృత్తిదారుల సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్.అంకయ్య కోరారు. నెల్లూరులోని సీఐటీయు కార్యాలయంలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 9నెలలు గడుస్తున్నా రజకుల సమస్యలు తీరలేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 20, 21 తేదీల్లో కొండపల్లిలో జరిగే రజకుల రాష్ట్ర మహాసభలను దిగ్విజయం చేయాలని సంఘసభ్యులను కోరారు. కొత్తకోట వెంకటేశ్వర్లు, కంచర్ల సాయి, దేవరకొండ వెంకటేశ్వర్లు, సుధాకర్, సురభి శ్రీనివాసులు, పండేటి సురేంద్ర, జి. శ్రీనివాసులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ప్రతిభతో రాణించాలి



విద్యార్థులు తమకు అందివచ్చిన విద్యావకాశాలను అందిపుచ్చుకుంటూ, వాటిని సద్వినియోగం చేసుకుని ప్రతిభతో రాణించాలని విక్రమసింహపురి విశ్వవిద్యాలయం వీసీ అల్లం శ్రీనివాసరావు చెప్పారు. ఈనెల 1న స్థానిక సిపిఆర్ కల్యాణమండపంలో కృష్ణచైతన్య సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల 17వ వార్షికోత్సవంలో ఆయన పాల్గొని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. దాదాపు ఏడు 7 సంవత్సరాలుగా ఈ కళాశాల ఎంతోమంది విద్యార్థులకు విద్యనందించడం అభినందనీయమన్నారు. అనంతరం, పీజీలో యూనివర్శిటీ స్థాయిలో బంగారుపతకాలు సాధించిన పలువురు విద్యార్థులను ఆయన అభినందించారు. విద్యాసంస్థల వ్యవస్థాపక ఛైర్మెన్ డాక్టర్ ఆర్‌వి కృష్ణారెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, రానా ప్రమోద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 'శ్రీ విశ్వావసు'..మీకు శుభాలనివ్వాలి!

### బ్రహ్మశ్రీ రామాయణం మహేష్‌స్వామి ఆశీర్వచనం




'శ్రీ విశ్వావసు' ఉగాది..మీ జీవితాలకు ఆనందాన్నివ్వాలని, సకల శుభాలను చేకూర్చాలని శ్రీ లలిత మహేశ్వరి ఆశ్రమం (ఇందుకూరుపేట) పీఠాధిపతులు బ్రహ్మశ్రీ రామాయణం మహేష్‌స్వామి అందరినీ ఆశీర్వదించారు. ఉగాదిని పురస్కరించుకుని నెల్లూరు టౌన్‌హాలు వర్ధమాన సమాజం రీడింగ్‌రూంలో మార్చి 31న జరిగిన ఉగాది పురస్కారాల సభలో ఆయన పాల్గొని ఉగాది ప్రాశస్త్యాన్ని వివరించారు. శ్రీ జీవన యోగశాల ఆరోగ్యసేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి స్థానిక శారదా క్రియేషన్స్ అధినేత్రి పాబోలు శారదామణి, యోగాలయం డైరెక్టర్ డా.జెకె స్వప్న జ్యోతి ప్రజ్వలనం చేశారు. అనంతరం, వివిధ రంగాల్లో విశేష సేవలందించిన వారికి రామాయణం మహేష్‌స్వామి చేతుల మీదుగా ట్రస్ట్ నిర్వాహకులు.. ప్రముఖ యోగా మాస్టర్ ఎంవి ప్రసన్నకుమార్, ఏ.జయప్రకాష్, యోగా గురు రవీంద్ర తదితరులు సన్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రపంచ తెలుగు సమాఖ్య రీజనల్ ఛైర్మెన్ నలుబోలు బలరామయ్యనాయుడు, కోట సత్యం తదితరులు పాల్గొని అవార్డు గ్రహీతలను అభినందించారు.




# విశేష సేవలకు.. 'శ్రీసిటీ-శ్రీవాణి' ఉగాది పురస్కారాలు



శ్రీసిటీ ఆధ్యాత్మిక, సాహిత్య వేదిక 'శ్రీవాణి' ఆధ్వర్యంలో వివిధ రంగాలలో విశిష్ట ప్రతిభ కనబరిచిన వ్యక్తులకు ఉగాది పురస్కారాలు ప్రదానం చేశారు. ఇటీవల శ్రీసిటీ బిజినెస్ సెంటర్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆ పురస్కారాలను అందజేసి, వారి ప్రతిభా పాటవాలను అభినందించారు. పురస్కార గ్రహీతలలో ఒకరైన ప్రఖ్యాత అవధాన కవి డాక్టర్ నరాల రామారెడ్డి (ప్రొద్దుటూరు),తెలుగు సాహిత్యం మరియు అవధాన కళలో నైపుణ్యం, అసమాన సేవలకు గుర్తింపుగా సత్కారాన్ని అందుకున్నారు. అదేవిధంగా, చరిత్రకారుడు డాక్టర్ ఈమణి శివనాగిరెడ్డికి విశిష్ట పురస్కారం ప్రదానం చేశారు. ఆలయ పునర్నిర్మాణం, చారిత్రక పరిశోధనలో విశేష కృషి చేసిన ప్రఖ్యాత శిల్పకళ, పురావస్తు నిపుణులు, చరిత్రకారుడు డాక్టర్ శివనాగిరెడ్డి సేవలను గౌరవిస్తూ పురస్కారం ప్రదానం చేశారు. తెలుగు సినిమా వికాసానికి విశేష కృషి చేసిన చలనచిత్ర చరిత్రకారుడు ఎస్.వి. రామారావు, ప్రఖ్యాత శాస్త్రీయ సంగీత విద్వాంసురాలు, రేడియో 'ఏ' గ్రేడ్ కళాకారిణిగా గుర్తింపు కలిగిన శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం సంగీత శాఖాధ్యక్షురాలు డాక్టర్ రాణి నాగశ్రీ శైలేశ్వరి, శాస్త్రీయ సంగీత సంప్రదాయానికి చేసిన సేవలకు గుర్తింపుగా సన్మానాన్ని పొందారు. మంచి వక్త, 'ప్రాసమణి'గా పేరు గాంచిన అన్నదాత సుబ్రహ్మణ్యేశ్వరరావు శ్రీసిటీ శ్రీవాణి పురస్కారం అందుకున్నారు. అవార్డు గ్రహీతలను శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి అభినందించారు. పురస్కారాల ప్రదానోత్సవం ప్రారంభంలో అవధాని కోట రాజశేఖర్, ఆర్.ఎం.భాస్కర్, డా. కే.జగ్గారావు, శ్రీమతి డి.ఝాన్సీ, బైరి పార్థసారథి అవార్డు గ్రహీతల గురించి పరిచయ వ్యాఖ్యలు చేశారు. శ్రీసిటీ పీఆర్వో బాలాజీ సమన్వయకర్తగా వ్యవహరించారు.

## శ్రీసిటీలో.. ఏపీఎస్పీడీసీఎల్ చీఫ్ ఇంజనీర్



ఆంధ్రప్రదేశ్ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (ఏపీఎస్పీడీసీఎల్) తిరుపతి చీఫ్ ఇంజనీర్ జానకిరాం ఇటీవల శ్రీసిటీని సందర్శించారు. విద్యుత్ సరఫరా అంతరాయాన్ని అరికట్టి, మెరుగైన సరఫరా అందించాలన్న శ్రీసిటీలోని జపాన్ పరిశ్రమల అసోసియేషన్ వారు ఏపీఎస్పీడీసీఎల ఛైర్మెన్‌కి చేసిన అభ్యర్థన మేరకు సీఇ శ్రీసిటీకి వచ్చి, కొన్ని పరిశ్రమలలో విద్యుత్ సరఫరా, తదితర సమస్యలను పరిశీలించారు. క్షేత్ర స్థాయిలో విద్యుత్ సబ్‌స్టేషన్లు, విద్యుత్ లైన్లను తనిఖీ చేశారు. అనంతరం ట్రాన్స్‌కో సూపరింటెండెంట్ ఇంజనీర్, ఇతర విద్యుత్ అధికారులతో సమావేశమై, శ్రీసిటీలో అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం చేపట్టాల్సిన చర్యలపై పలు సూచనలు, ఆదేశాలు ఇచ్చారు.



## ఆత్మీయ అభినందన

శాసన మండలి సభ్యుడిగా రెండవసారి ఎంపికైన తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్రని, ఆయన సతీమణి శ్రీమతి జ్యోతిని ఆత్మీయంగా అభినందించి సత్కరిస్తున్న 'లాయర్' సంపాదకులు శివప్రభాత్‌రెడ్డి (ప్రభు)








## పుణ్య సంస్మరణ

మాన్యుడు, మరపురాని నేత

### శ్రీ సోమిరెడ్డి రాజగోపాలరెడ్డి గారు

కీర్తిశేషులై ఏప్రిల్ 6వ తేదీకి 42 సంవత్సరాలు గడవనున్న సందర్భంగా ఆ పుణ్యమూర్తిని స్మరిస్తూ...

వారి పవిత్రాత్మకు భక్త్యంజలి ఘటిస్తున్నాము.

కుమారులు: **సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి - జ్యోతి**
సర్వేపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు, తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు

**లేట్ సోమిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి**

కుమార్తెలు - అల్లుళ్ళు

**కట్టంరెడ్డి రాణీసంయుక్త - రాధాకృష్ణారెడ్డి**
**కేతిరెడ్డి ఉషారాణి - రామకోటారెడ్డి**

| మనుమలు | - | మనుమరాండ్రు | మునిమనుమలు | మునిమనుమరాండ్రు |
|---|---|---|---|---|
| సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి | - | శ్రుతి | యల్లా శర్విన్ | యల్లా సంజన |
| డా॥ సోమిరెడ్డి అర్జున్‌రెడ్డి | - | డా॥ లక్ష్మీ ఐషిత | కేతిరెడ్డి శ్రీమన్ | సోమిరెడ్డి శివాని |
| సన్నారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి | - | నీలిమ | నిమ్మ ధీర్ | కేతిరెడ్డి శ్రితిక |
| నిమ్మ కౌశిక్‌రెడ్డి | - | డా॥ సింధు | కేతిరెడ్డి శ్రీవంత్ | కట్టంరెడ్డి శ్రీశాన్వి |
| యల్లా సనత్‌రెడ్డి | - | షాలిని | సన్నారెడ్డి రాయల్ భార్గవ్ | కట్టంరెడ్డి హవిష |
| డా॥ కేతిరెడ్డి కళాధర్‌రెడ్డి | | | నిమ్మ నరేన్ | సన్నారెడ్డి నిరుక్తలేఖ |
| కేతిరెడ్డి శశిధర్‌రెడ్డి | - | కీర్తి | సోమిరెడ్డి రణదేవ్ | సోమిరెడ్డి అమైరా |
| కట్టంరెడ్డి విక్రమ్‌రెడ్డి | - | స్నిగ్ధ | సోమిరెడ్డి ఆగస్త్య | |



జానకిరామ.. 59

# రామాయణం

- ఊటుకూరు జానకి రామారావు



అక్కడ సుందరంగా, పవిత్రంగా, ఏకాంతంగా ఉన్న ఒక ఆశ్రమానికి చేరుకున్నాడు.

అక్కడ కృష్ణాజినాన్ని, జటలను, నారచీరను ధరించి, ఆహారనియమాలు పాటిస్తూ తాపసవృత్తిలో ఉన్న ముని వేష ధారియైన మారీచుని చూశాడు.

వచ్చిన రాక్షస రాజుకు యధావిధిగా అతిథి సత్కారాలు గావించాడు మారీచుడు.

అంత త్వరగా మరల తనవద్దకు రావడానికి గల కారణ మేమిటి? అని ప్రశ్నించాడు.

నేను ఆపదలో ఉన్నాను, నన్ను గట్టెక్కించు తండ్రీ, నాకు కష్టాలు వచ్చినప్పుడు నీవేకదా దిక్కు నాకు, వాడెవడో రాముడట, జనస్థానంలో మునులకు భీతి గొల్పుతూ నిర్భయంగా సంచరించే నా వాళ్ళను పదునాల్గు వేలమందిని ఖర, దూషణ, త్రిశిరులతో సహా ఒక్కడే హతమార్చాడు.

వాడు తన కోపాన్నంతా తన ధనుస్సుపై ఆవాహన చేసి పాదచారిగా ఉండి వాడివాడిగా వాడి బాణాలు ప్రయోగించి ఒక్కడినీ వదిలిపెట్టకుండా మన వారందరినీ చంపివేసి ఋషులు భయంలేకుండా తిరిగేటట్లు చేశాడు ఆ దుర్మార్గుడు.

ఆ రాముడు అధర్మవర్తనుడు, కఠినుడు, లుబ్ధుడు, చెడ్డవాడు ప్రాణుల కీడు కోరేవాడు, ఇంద్రియలోలుడు! తండ్రి కోపించి వెళ్ళగొడితే భార్యను తీసుకొని, తమ్ముడితో కూడి కట్టుబట్టలతో అడవిలో సంచరిస్తున్నాడు. దరిద్రుడు వాడు.

మన శూర్పణఖను ఏ కారణం లేకుండా వికృతరూపను చేసినాడు, దాని ముక్కుచెవులు నిష్కారణంగా కోసివేశాడు. దానికి ప్రతీకారం చేయవలె! వాడి భార్య సీతను బలాత్కారంగా వాడినుండి దూరం చేయవలె!

ఆ సీతను ఎత్తుకొని రావాలనుకుంటున్నాను, అందుకు నీ సహాయం కావాలి నాకు అని అడిగాడు రావణుడు మారీచుడిని.

నీవు మాయారూపాలు ధరించడంలో ప్రవీణుడవు కావున, వెండి చుక్కలతో బంగారు రంగుతో మెరిసిపోయే లేడి రూపాన్ని ధరించు, వారి ఆశ్రమ పరిసరాలలో సంచరించు, అందంగా ముచ్చటగొలిపే నిన్ను చూసి సీత మోహంలో పడి నిన్ను పట్టి తెమ్మని అన్నదమ్ములను పంపిస్తుంది.

వారిని నీవు దూరంగా తీసుకొని వెళ్ళిన తరువాత నేను ఆవిడని ఎత్తుకొని వెళ్ళిపోతాను.

భార్య లేని రాముడు మనోవేదనతో కుంగిపోతాడు అప్పుడు చాలా సులువుగా అతనిని నేను కొట్టగలను. అని తన మనసు లోని ప్రణాళిక బయటపెట్టాడు.

ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాడు మారీచుడు!

రాముడి పేరు వినబడగానే.. ఆతని ముఖం వాడిపో యింది, భయంతో గజగజ వణికిపోయాడు.

ముఖంలో కళతప్పి చనిపోయినవాడిలాగా అయిపోయాడు. ఎండిపోయిన పెదవులతో దీనంగా ప్రాణం లేని చూపు చూశాడు రావణుని.

రావణా నీకు ఎవరు చెప్పారు రాముడి జోలికి వెళ్ళమని! నీ గూఢచార వ్యవస్థ సక్రమంగా పనిచేస్తుందా?

లేదు, పని చేయడం లేదు!

అందుకే నీవు సద్గుణాలప్రోవు, వీరాధివీరుడు అయిన రాముని గూర్చి అనరాని మాటలంటున్నావు...

రావణా ముల్లోకాలలో ఉన్న రాక్షసులకు ఏదో కీడు మూడే టట్లే ఉంది. సీతాదేవి నీ చావుకోసమే పుట్టినట్లుంది, ఆవిడ మూలాన నాకు కూడా మరణం సంభవించవచ్చునేమో!

హాయిగా, స్వేచ్ఛగా, నిరంకుశంగా ఇప్పటిదాకా రాజ్య పాలన చేస్తున్నావు, రాక్షసుల సుఖసంతోషాలు, లంకాపట్టణం నీ యీ చర్యవలన నశిస్తాయేమో అని అనుమానంగా ఉంది.

నీవు అనుకున్నట్లుగా కౌసల్యానందనుడు దుష్టుడు, దురాత్ముడు, కఠినుడు, అపండితుడు, ఇంద్రియలోలుడు కాదు.

ఆయన తన తండ్రిని కైకేయి మోసం చేయటం చూసి తండ్రిని సత్యవాదిని చేయటం కోసం తన అంత తానుగా అరణ్యానికి వచ్చాడు.

ఆయన సకల భూత మనోహరుడు.

***రామో విగ్రహవాన్ ధర్మః సాధు సత్య పరాక్రమః***
***రాజా సర్వస్య లోకస్య దేవానాం మఘవానివ***

రాముడు మూర్తీభవించిన ధర్మం, సత్పురుషుడు, సత్యమైన పరాక్రమం కలవాడు, దేవతలకు దేవేంద్రుడు వలెనె సర్వ లోకాలకు ప్రభువు.

సీతమ్మ రాముడి రక్షణలో ఉంది. సూర్యుడి నుండి ఆయన కాంతిని ఎవరైనా అపహరించగలరా?

రాముడు ప్రజ్వరిల్లుతున్న నిప్పు, ఆయన బాణాలు ఎగసే అగ్నికణాలు.

తెలిసి, తెలిసి ఆ మంటలలో దూకి బూడిద కావద్దు.

సీతాదేవి రాముడికి ప్రాణం, ఆవిడ ఎల్లప్పుడూ ఆయననే అనుసరించే వ్రతం కలది! ఆవిడ మరొక అగ్నిజ్వాల!

వ్యర్థమయ్యే ఈ పనిలోకి ఎందుకు ప్రవేశిస్తావు. రాముడి తేజస్సు ఇంత అని చెప్పటానికి సాధ్యం కాదు.

రాముడు ఏనాడైతే రణరంగంలో నిన్ను చూస్తాడో ఆనాడే నీకు భూమి మీద నూకలు చెల్లిపోతాయి!

రాముడి కన్ను పడనంతవరకే నీ బ్రతుకు.

హాయిగా పదికాలాలు రాజ్యం చేయాలని అనుకొంటే ఈ పిచ్చి ఆలోచన మానుకో.

వెళ్లి విభీషణాదులతో చర్చించి నీ బలమెంతో, రాముని బలమెంతో సరిగా అంచనా వేసుకొని నీకేది హితమో ఆ పని చెయ్యి...

అని మారీచుడు స్పష్టంగా రావణునికి హితబోధ చేశాడు.

ఇంకా రాముడి పరాక్రమం గురించి తన అనుభవం చెప్పసాగాడు...

నేను ఒకప్పుడు వేయి ఏనుగుల బలంతో, పర్వతమంత ఆకారంతో సంచరిస్తూ మునుల ఆశ్రమాల మీదకు దండుగా వెళ్లి వారివారి యజ్ఞాలను భంగం కావిస్తూ ఉండేవాడిని.

ఒకసారి విశ్వామిత్ర మహర్షి ఆశ్రమంలో కలిగిన అనుభవం చెపుతాను విను.

ఆ మహర్షి ఒకప్పుడు గొప్ప యజ్ఞం చేయ సంకల్పించి యాగరక్షణార్థం దశరథ మహారాజు వద్దకు వెళ్లి ఆయన కొడుకును తనతో పంపమన్నాడు. అందుకు ఆ రాజు వీడింకా పసిబాలుడు, నా చతురంగబలాలు తీసుకొని నేనే వస్తాను అని అన్నాడు.

అందుకు మహర్షి నిరాకరించి, నా యజ్ఞ విధ్వంసానికి పూనుకునే రాక్షసులు సామాన్యులుకారు, వారిని వధించాలంటే రాముడొక్కడే శరణ్యం. కావున రాముని పంపు అని ఆయనను ఒప్పించి, పసిబాలుడైన రాముని తెచ్చుకుని కాపలా పెట్టుకున్నాడు.

రాముడికి అప్పటికింకా పసితనపు చాయలు పోలేదు. విశాలమైన నేత్రాలు, శోభాసంపన్నుడైన రాముడికి మీసం కూడా మొలవలేదు.

ఒకటే వస్త్రం చుట్టుకొని, జుట్టుముడిపెట్టుకొని బంగారు మాల ధరించి, చిత్రంగా ఉన్న ధనస్సును చరుచుకుంటూ ఆశ్రమ వాకిట అటూఇటూ తిరుగుతున్నాడు.

నేను అప్పుడు మహర్షి ఆశ్రమం లోపలికి ప్రవేశిస్తూ ఉండగానే నన్ను గమనించి ఏ మాత్రం తొట్రుపాటు, భయం లేకుండా ధనస్సుకు నారి కట్టాడు.

ఆ! వీడేమిచేస్తాడు బాలుడు అని లక్ష్యపెట్టక తొందరగా విశ్వామిత్రుడి యజ్ఞవేదిక వద్దకు వెళ్ళాను.

అప్పుడు నాకు గుర్తు! ఒకేఒక్క బాణం రయ్యిన దూసుకుంటూ వచ్చి నన్ను నూరు యోజనముల దూరంలోనున్న సముద్రంలో పడవేసింది.

ఎందుకు దయతలచాడో కానీ నాకు తెలవదు, నన్ను మాత్రం ప్రాణాలతో విడిచిపెట్టాడు. సముద్రంలో పడ్డ నేను కొంతసేపటికి తేరుకొని బ్రతుకుజీవుడా అని లంకకు చేరు కున్నాను. అప్పటికి రాముడు అస్త్రవిద్య పూర్తిగా నేర్చుకొని యుండలేదు.

ఈ మధ్య కాలంలో జరిగిన సంఘటన ఒకటి చెపుతాను విను... మనవాళ్ళు ఇద్దరితో కలిసి ఒక క్రూరమైన మృగ రూపం ధరించి అడవిలో మునులను భయపెడుతూ సంచ రిస్తున్నాను నేను.

భార్య, తమ్ముడితో కలిసి అడవిలో రాముడు ఉండటం చూశాను. వాళ్ళను చూడగానే పూర్వం నాకు జరిగిన అవమానం గుర్తుకు వచ్చి వారిని భక్షించాలని తలచి మెల్లగా వారి ఆశ్రమ ప్రాంతంలోనికి చేరుకున్నాం.

ఎట్లా పసిగాట్టాడో పసిగట్టాడు రాముడు, మూడు బాణాలు ధనస్సుకు తొడిగాడు. అవి మాకోసమే అని అర్థమయ్యి అవి ధనుస్సు నుండి వెలువడేలోగానే నేను తప్పించుకున్నాను.

పాపం వారిరువురికీ రాముడి బాణం గురించిన జ్ఞానం లేకపోవటం చేత వాటి బారినపడి మృతులయ్యారు.

.. (సశేషం)

# మనం సిద్ధంగా ఉన్నామా?



మయన్మార్, థాయ్‌లాండ్ లోని బ్యాంకాక్‌లో భూకంపం సృష్టించిన విధ్వంసానికి వేల మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల సంఖ్య ఇంకా పెరగ వచ్చనే ఆందోళన వ్యక్తమవు తోంది. బ్యాంకాక్‌తో పోలిస్తే మయన్మార్‌లో ప్రాణ నష్టం ఎక్కువగా ఉండడానికి ప్రధాన కారణాల్లో పాలన వ్యవస్థ ఒకటి. మయన్మార్‌లో ప్రభుత్వం సైనిక పాలన ఆధ్వర్యంలో నడుస్తోంది. అక్కడ ప్రకృతి విపత్తుల ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు కానీ, విపత్తు నిర్వహణ వ్యవస్థకానీ, సంబంధిత సాంకేతిక పరిజ్ఞానాన్ని కానీ పకడ్బందీగా రూపొందించుకోలేదు. సమాజంలో నిత్యం ఘర్షణ పూరిత వాతావరణం ఉన్నప్పుడు సురక్షిత వ్యవస్థలను అభివృద్ధి చేసుకోవడం కష్టమవు తుంది. ఈ విషయాన్ని పక్కనపెడితే మన దేశం కూడా భూకంపాల తాకిడి ఉన్న దేశమే. అనుకోని ఉపద్రవం వచ్చినప్పుడు భారత్‌లో వ్యవస్థలు ఎంతవరకు సిద్ధంగా ఉన్నాయో తీవ్రంగా మదింపు వేసుకోవాల్సిన సమయం ఇది. భారత్‌లో 59 శాతం ప్రాంతం చిన్నవో, పెద్దవో-భూకంపాలు సంభవించే జోన్ల పరిధిలో ఉంది.

2024 జనవరి 13నుంచి 2025 ఫిబ్రవరి వరకు భారత్‌లో 159 భూకంపాలు నమోదయ్యాయి. ఢిల్లీలో ఫిబ్రవరి 17న 4 తీవ్రతతో నమోదయిన భూకంపం ఇప్పటివరకు చివరిది. భారత్‌ను భూకంపాలు సంభవించే అవకాశాలు, తీవ్రత పరంగా 5 జోన్ల కింద విభజించారు. జోన్-5లో ఉంటే ఎక్కువ రిస్క్‌లో ఉన్నట్లు. జమ్మూ కశ్మీర్‌లోని కొన్ని ప్రాంతాలు, పశ్చిమ, మధ్య హిమాలయ ప్రాంతాలు, బిహార్ లోని ఉత్తర, మధ్య ప్రాంతాలు, ఈశాన్య భారత్ ప్రాంతం, కచ్, అండమాన్, నికోబార్ దీవులు, లద్దాఖ్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, సిక్కిం జోన్ -5, జోన్-4 పరిధిలో ఉన్నాయి. జోన్ 3, 2 కింద చెన్నై, ముంబయి, పుణె, కోల్‌కతా, భువనేశ్వర్, జంషెడ్‌పూర్, అహ్మదాబాద్, సూరత్, లఖ్నవూ, వడోదర, మంగ ళూరు, విజయవాడ, కోయంబత్తూర్, హైదరాబాద్ తదితర నగరాలున్నాయి.

మనసులో మాట 39

భారత్‌లో గత 15 ఏళ్ల కాలంలో భూకంపాల కారణంగా 20వేల మంది మరణించారు. ఈ ప్రాణ నష్టానికి భూకంపాలే మూలకారణం కావచ్చు కానీ నిర్మాణ లోపాలు కూడా ఒక ప్రధాన కారణం. భవనాల పటుత్వం బలహీనంగా ఉండడం వల్లే ప్రాణ నష్టం ఎక్కువగా జరుగుతుంది. కేంద్ర ప్రభుత్వం ఈ విషయాన్ని గమనంలోకి తీసుకుని భూకంపాలను తట్టుకునే విధంగా భవన నిర్మాణ నిబంధనల్లో మార్పులు సూచించింది. భూకంపాలను తట్టుకునే విధంగా బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ నిర్మాణ ప్రమాణాలను సూచించింది. కానీ అమల్లోకి వచ్చేసరికి వాటిని పాటించేవారి శాతం చాలా తక్కువ. వ్యక్తిగత నిర్మాణ దారులకు ఈ నిబంధనలు, ప్రమాణాలపై అవగాహన తక్కువ. భవన నిర్మాణ నిబంధనలను పర్యవేక్షించే యంత్రాంగంలో అలసత్వం గురించి చెప్పాల్సిన పని లేదు. చుట్టూ వదలాల్సిన జాగా, ఎత్తు తదితర నిబంధనల విషయంలోనే పట్టణ ప్రణాళిక విభాగం వారి పర్యవేక్షణ ఎంత లోపభూయిష్టంగా ఉందో అందరికీ తెలుసు. ఇక ఆకాశ హర్మ్యాలు, చిన్న అపార్టమెంట్ల విషయంలోనూ నిబంధనల అతిక్రమణ మామూలయిపోయింది. పటిష్టమైన స్ట్రక్చర్‌తో నిర్మిస్తున్నారా లేదా అన్న విషయాన్ని పకడ్బందీగా తనిఖీచేసే యంత్రాంగం లేనే లేదు.

సెస్మిక్ జోన్లు-4, 5 పరిధిలో దాదాపు 20 కోట్ల భవనాలున్నాయని జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ వెల్లడిస్తోంది. వాటిల్లో చాలా భవనాలు 30-40 ఏళ్ల క్రితం నిర్మించినవి. అప్పటికి జాతీయ నిర్మాణ ప్రమాణాల పట్ల పెద్దగా అవగాహన లేదు. స్ట్రక్చర్ ఇంజినీర్ పర్యవేక్షణ లేకుండా సంప్రదాయ తాపీ మేస్త్రీలు కట్టినవే ఎక్కువ. అటువంటి భవనాలన్నింటినీ పునఃపటిష్టం చేయాల్సిన అవసరం ఉంది. లేదంటే భూకంపం అంటూ వస్తే వాటిల్లే నష్టం తీవ్రంగా ఉండే అవకాశాలున్నాయి. ఇప్పటినుంచి నిర్మించే భవంతులైనా జాతీయ నిర్మాణ కోడ్ ను అనుసరించి నిర్మించేలా పటిష్ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

భూకంపాలు, లేదా ఇతర ప్రకృతి విపత్తులు సంభవించిన తర్వాత రక్షణ చర్యలకు ఉపక్రమించడం కంటే ముందుగానే నివారించే చర్యలు చేపట్టడం ఉత్తమం. దీనికి సమగ్ర జాతీయ విధానాలు అవసరం. ఉదాహరణకు చెప్పాలంటే పట్టణీకరణ వేగంగా విస్తరిస్తోంది. అంటే ప్రజల సాంద్రత ఒక చోటకు పోగుపడు తోంది. పట్టణీకరణ, నగరీకరణ పెరుగుతున్న కొద్దీ బహుళ అంతస్తులు పెరుగుతాయి. దీనివల్ల ఉత్పన్నమయ్యే సమస్యలు ఎక్కువ. నష్టం జరిగే అవకాశాలూ పెరుగుతాయి. విపత్తులంటూ సంభవిస్తే జరిగే నష్టం ఎక్కువగా ఉంటుంది. అందువల్ల ఎక్కువ జనసమూహం ఒకే చోట పోగుపడే విధానాలకు బదులు వికేంద్రీకరణ విధానాలు అవలంబించాలి. వలసలకు ఆస్కారం లేకుండా ఉపాధి అవకాశాలు మెరుగుపర్చాలి. నగరాల్లోనూ అవసరాలకు మించి ఇళ్ల నిర్మాణం జరుగుతోందని వివిధ గణాంకాలు సూచిస్తున్నాయి. ఖాళీగా ఉన్న యూనిట్లు చాలా ఉన్నాయని గణాంకాలు చెబు తున్నాయి. ప్రభుత్వాలు ఇలాంటి విషయాలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. చేతులు కాలాక ఆకులు పట్టుకోవడం కంటే... ముందే జాగ్రత్త పడడం మంచిది.



తుమ్మల బాల గంగాధర్ తిలక్

# తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

## ముగిసిన ముత్యాలమ్మ జాతర



ముత్యాలమ్మ జాతరలో బాగంగా చివరిరోజు పుట్టినిల్లైన కుమ్మరి ఇంటి నుంచి మెట్టినిల్లైన చాకలి ఇంట గంగమిట్టపై కొలువిదీరిన పోలేరమ్మ వెళ్లనంపు ఉత్సవం ఘనంగా జరిగింది. పోలేరమ్మ ప్రతిష్ఠాపనతో ప్రారంభమైన జాతర నాలుగోరోజు వెళ్లనంపుతో ముగిసింది. మూడవరోజు రాత్రి సత్తి పోలేరమ్మ, అంకమ్మ, పరశు రాముడు విగ్రహాలను ఊరేగించారు. గాండ్ల కులస్థులు పోలేరమ్మకు ప్రత్యేక పూజలు జరిపారు. గణాచారి ఉయ్యాల జంపాల ఊగుతూ భక్తులను అలరించారు. చివరిరోజు ముత్యాలమ్మ దర్శనార్థం సమీప గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. డీఎస్పీ గీతాకుమారి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. దర్శనం టికెట్ల ద్వారా రూ.16,85,300, హుండీల ద్వారా రూ.30,81,538, మొక్కుబడుల కింద వదలిన 182 దున్నల వేలంతో రూ.16.20 లక్షలు మొత్తం రూ.63,86,838 ఆదాయం వచ్చింది. గతేడాది కంటే రూ.4,63,899 ఆదాయం పెరిగిందన్నారు. ఆలయం ఈవో నవీన్‌కుమార్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## స్టేడియంలో అన్ని వసతులు కల్పిస్తాం

### ఎమ్మెల్యే సునీల్‌కుమార్



గూడూరు అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో క్రీడాకారులు నిర్మించుకున్న క్రికెట్ రూమ్‌ను, నూతనంగా ఏర్పాటు చేసిన వాలీబాల్ కోర్టును ఇటీవల గూడూరు శాసనసభ్యులు డాక్టర్ పాశిం సునీల్‌కుమార్ ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ స్టేడియంలోని క్రీడాకారులకు, వాకర్స్‌కి ఎలాంటి అవసరం వచ్చినా నేను సహకరిస్తానని, స్టేడియంలో ఉన్నటువంటి సమస్యలు అన్నింటినీ ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ వస్తున్నానన్నారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షులు వేగూరు రాజేంద్రప్రసాద్, సీఐ శ్రీనివాసరెడ్డి, రూరల్ ఎస్.ఐ మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

## రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు

గూడూరు శ్రీ ముత్యాలమ్మ దేవస్థానం ఛైర్మెన్, రెడ్డి సంఘం గౌరవ అధ్యక్షులు శ్రీమతి ఇంద్రసేనమ్మ నివాసంలో సింహపురి రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. టివిఎల్ ప్రసాద్ విశ్వావసు నామ సంవత్సర పంచాంగ శ్రవణం చేయగా, ఆయనను ఇంద్రసేనమ్మ ఘనంగా సత్కరించారు. అనంతరం ఉగాది పచ్చడి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ముఖ్యఅతిథులుగా ప్రముఖ వైద్యులు జనార్ధనరెడ్డి, రోహిణిలు విచ్చేయగా, పేట వెంకటకృష్ణారెడ్డి, ధనంజయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## నూతన హంగులతో భరతనాట్య పాఠశాల

కళలను ప్రోత్సహించే క్రమంలో గూడూరు సంస్కృతి సమ్మేళనం ఆధ్వర్యంలో నూతన హంగులతో భరతనాట్య పాఠశాలను దాతల సహకారంతో సుందరంగా తీర్చిదిద్దారు. ఉగాది పండుగ, సంస్థ 51వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఇటీవల పాఠశాల భవనాన్ని ప్రారంభించారు. నటరాజస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాట్య గురువు, సంస్కృతి సమ్మేళనం పొన్నలూరు వీరరాఘవరెడ్డి, సంగీత, నృత్య పాఠశాల ప్రిన్సిపాల్ పిండి మల్లిక, వెంకయ్య ఆధ్వర్యంలో చిన్నారులు గజ్జల పూజ చేశారు. అనంతరం సంస్కృతి సమ్మేళనం కార్యదర్శి కొణిదల మునిగిరీష్ ఆధ్వర్యంలో సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. సంగీత విభాగ వ్యవహకర్త కట్టా మురళీకృష్ణ, కనుపూరు ముత్యాలమ్మ దేవస్థానం మాజీ ఛైర్‌పర్సన్ సిద్దారెడ్డి ఇంద్రసేనమ్మ, ప్రముఖ వైద్యురాలు రోహిణీ పాల్గొని ప్రసంగించారు. ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని సంస్కృతి సమ్మేళనం కళలు, సాహిత్యానికి ప్రోత్సాహం అందిస్తున్నట్లు తెలిపారు. శ్రీ శివలలిత భరతనాట్య కళాశాల వ్యవస్థాపకులు పిండి మల్లిక, వెంకయ్య, సంస్కృతి సమ్మేళనం సభ్యులు చిరువెళ్ళ అనీల్‌కుమార్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని బహుమతి ప్రదానం చేశారు.


## బలమైన గొంతుక 'తడి ఆరని వాక్యమొకటి'

'నా అక్షరాల్లోని అన్ని వేదనలూ నావి కావు, కాని అన్ని వేదనలలోనూ నేను ఉన్నాను' అని లోకం బాధ తన బాధగా అభివర్ణించారు సుధా మురళి 'తడి ఆరని వాక్యమొకటి' కవితా సంపుటిలో. స్త్రీవాదం కొంత, సమస్యల సునామీ పిడికెడంత చేపట్టి తనదైన పదునైన అభివ్యక్తిని జోడించి, పరిపూర్ణత కవిత్వంలో నెలకొన్న విధంగా తపనపడ గల్గడం సుధా మురళికే చెల్లింది. ఆమె ఇంకా అధ్యయనం చేయ గలదు, మరింత పరిపూర్ణత సాధించగల దనడంలో సందేహం లేదన్పిస్తుంది.

'నేనిప్పుడు దుఃఖాన్ని మోయకూడదని నిర్ణయించుకొన్న కలాన్ని' అంటూ దుఃఖానికి వ్యతిరేకంగా తన ముద్ర వేస్తారామె. సమాజ హితాన్ని, సమాజంలో సంతోష రీతులు నెలకొనాలనే తపన ఆమెది. 'మరణాన్ని ఎరుగని పుట్టుక నవ్వాలని' విప్లవ కవితలో సూత్రీకరిస్తారు. మనిషి మరణం సహజాతి సహజం. కాని మరణించిన తర్వాత కూడా బ్రతకడమనే ఆమె భావుకత ఈ వాక్యంలో ప్రతిఫలిస్తుంది. దాని కోసం మనిషితనం పరిమళించి ఫరిడవిల్లాలనేది ఆమె సిద్ధాంతంగా కన్పిస్తుంది. అదే కవితలో 'నా కలల స్వరాలు అనంతసాగర సంగమాలు కారాదు, మరకల పుటలపై నిండార నిండిన నీటి చెమ్మల చిత్రాలయితే చాలు' అంటూ తనకు బారెడు ఆశలూ కోర్కెలూ లేవుగాని చిన్న చిత్రమై వెలుగొందితే చాలున్న తృప్తిని, ఆకాంక్షను వెలుబుచ్చుతారామె. 'రేపటి చరిత్రలో దుఃఖం ఎరుగని రోజుని లిఖిస్తే చాలు.. అదే పదివేలు. అదొక్కటే చాలు'. ఎంత చక్కని సంపూర్ణ హృదయమో కదా కవయిత్రిది. లోకంలో శోకం మాయమైతే అదొక్కటే చాలన్న విశాల హృదయం ఆమెది కావడం నిండైన విశేషం.

'మరకా మంచిదే' కవితలో ఈ మరకలూ మంచివే, ప్రేమగా మనల్ని ఖాళీ చేసినా, తియ్యగా మన జీవితాన్ని కొరుక్కుతిన్నా ఎంతో కొంత మార్పును స్వాగతిస్తాయి.. అంటారు. అంతేకాక, ఎడారుల్లోని ఎండమావులు తారసపడతాయనే ఆశనూ ధ్వనిస్తారు. మార్పు కోసం ప్రతి చిన్న ధ్వనిలోను తనదైన ఆశతో ఎదురుచూస్తారా కవయిత్రి. మరకా మంచిదే అని సబ్బుల వాళ్ళు ఇబ్బడిముబ్బడిగా డబ్బు చేసుకొన్నవేళ మరకలో మార్పును చూడగల్గడం కవయిత్రి ప్రత్యేకత. అందుకు అభినందనీయం. ప్రతివాక్యంలోనూ 'నిధిని నిక్షిప్తం చేసిన భావుకత' కవయిత్రిది.

ఆడిబిడ్డకు దేహం ఒక శాపం. ఒక భోగలాలస వస్తువు. సమాజం ఆ దేహంపై కన్నేస్తుంది. దేహాన్ని రారమ్మంటుంది. ప్రపంచమే స్త్రీ దేహం చుట్టూ తిరుగుతుందంటే అతిశయోక్తి కాదు. ఆ దేహ సమర్పణ చేసి జీవనాన్ని సాగించే అభాగినుల బాధామయ లోకాన్ని గుప్పెడు కన్నీళ్ళతో కడిగిన గొప్ప కవిత 'దేహం శరణం గచ్ఛామి'. 'నాకంటూ ఒక రాత్రిని లేకుండా చేసి ఎందరి కండకావరాల్ని నాకు పరిచయం చేసింది ఈ దేహం' అంటూ ఓ వెలయాలి మనోవేదనను ఆర్తితో చెప్తారామె. 'ఒక్క పూటకు నన్ను సొంత పరచుకొనేందుకు అన్ని పూటలా ఇంటిల్లిపాదిని పస్తుపెట్టిన ఘనులెందరో'నని మరో కోణంలో విశ్లేషిస్తారు.






రచయిత్రి: సుధామురళి
వెల: రూ.200/- పేజీలు: 202
ప్రతులకు: పద్మ సుధామణి
డో.నెం. 6-4-5, పిచ్చిరెడ్డి తోపు,
జ్యోతి మెడికల్స్ ఎదురుగా,
కరెంట్ ఆఫీసు దగ్గర, నాయుడుపేట,
తిరుపతి. సెల్: 9491311049.

'ఘడియల్లో ప్రేమను తూచే కొలజాడీ ఈ దేహం. గర్భంలో పిండం ఎరుగని బేహారీ ఈ దేహం' అని నర్మగర్భంగా వేశ్యల బాధాతప్త జీవితాన్ని నగ్నంగా చిత్రీకరిస్తారు కవయిత్రి. ఆమె చెప్పిన విధానంలోని సంపూర్ణతే ఆమెను కవయిత్రిగా, చేయి తిరిగిన రచయిత్రిగా నిలుపుతుంది. ప్రతి పాదమూ ఓ సంద్రం, శెభాష్ అన్పించేలా రాయగల ప్రతిభ సుధామురళిదంటే అతిశయోక్తి కాదు.

'సర్దుబాటు' కవిత మహత్తరంగా సాగుతుంది. ఇప్పుడిక ఒక్కటయ్యే వీలులేదురా విడిపోదాం అంటూ ప్రారంభించిన కవితలో 'పాత సామాన్ల కొట్టోడు పదేపదే అరుస్తాడు.. విరిగిన మనసుల్ని మాత్రం తీసుకోడని' సరికొత్త భావనను ముందుకు తెస్తారామె... రాలిపోయిన ఆకును ఫెవిక్విక్ పునర్జీవింపచేయదంటూ. ఇంత జరిగాక కూడా శుభం పలకడానికి ఎవ్వరూ ముందుకు రాకపోవడం అత్యంత విషాదం ఇప్పుడు అని ముగిస్తారు. సర్దుబాటుకు వీలులేని పరిస్థితుల్ని ఎద్దేవా చేస్తారామె. రాజీయత్నాలకు అనుకూలత ప్రదర్శించడం చక్కని ముగింపు.

వర్తమాన సాహిత్య చరిత్రలో బలమైన గొంతుక సుధా మురళిది. విషాదగీతికల విధిని మార్చాలన్న దృఢసంకల్పం కవయిత్రిది. తడి ఆరని వాక్యంతో లోకంలో చిత్తడిని మార్చాలనే తపన ఆమెది. ఆమె భావవేశాన్ని, భావ వైరుధ్యాన్ని అభినందిస్తున్నాను.



సమీక్షకులు:
**చిన్ని నారాయణరావు**
9440202942

## ఉదయగిరిని ప్రగతిపథంలో నడిపిద్దాం!

### ఎమ్మెల్యే కాకర్ల



ఉదయగిరి నియోజకవర్గాన్ని ప్రగతి పథంలో నడిపిద్దామని, అందుకు అందరూ సహకరించాలని ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ కోరారు. ఇటీవల వింజమూరులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయలో జరిగిన మండల ప్రజా పరిషత్ అధికారుల సమీక్షా సమావేశంలో ఆయన ఉదయగిరి నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల ప్రజా పరిషత్ అధికారులతో మాట్లాడారు. గ్రీవెన్స్‌డేలో ప్రజల నుంచి వచ్చే సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆయన అధికారులకు సూచించారు. మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కింద పనిదినాలను పెంచి ఉపాధి కల్పించాలన్నారు. ఉపాధిహామీ పథకం కింద పనిచేసే ప్రతి పని ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలన్నారు. రైతులను, నాయకులను భాగస్వాములను చేసుకుంటూ పనులు చేయాలన్నారు. ఆ పథకం కింద గత సంవత్సరంలో మండలాల వారీగా చేసిన పని వివరాలు, బడ్జెట్ తదితర అంశాలను ఆయన అధికారులతో చర్చించారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య అధికారులు వారధిగా నిలిచి ప్రభుత్వానికి మంచిపేరు తేవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎనిమిది మండలాల ఎంపీడీవోలు, ఈవో పీఆర్‌డీలు, టీడీపీ మండల కన్వీనర్లు నాయకులు తదితరులు ఉన్నారు.

## ఎన్‌బికెఆర్‌లో అలరించిన.. 'మంగ్లీ' సంగీత విభావరి



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్టీలో ఇటీవల మ్యూజికల్ ఫెస్ట్-2025 కార్యక్రమాన్ని కళాశాల కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ నేపథ్య గాయని మంగ్లీ, వారి బృందంతో కలిసి పాడిన జానపద గీతాల సంగీత విభావరి అందరినీ అలరించింది. ఆమె పాడుతున్న పాటలకు విద్యార్థులు నృత్యాలు చేస్తూ కేరింతలతో ఆహ్లాదంగా గడిపారు. రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు చదువులతో పాటు ఆహ్లాదం కలిగించే ఇలాంటి కార్యక్రమాలు ప్రతి ఏడాది కళాశాలలో నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు కూడా పాటలు, సంగీతంలో రాణించాలన్నారు. అప్పుడే భారతీయ సంస్కృతులు, సంప్రదాయాలు నిలుస్తాయన్నారు. విద్యార్థుల్లో అంతర్గతంగా ఎన్నో కళలు ఉంటాయని, వాటిని వెలికితీయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డా. విజయ్‌కుమార్ రెడ్డి, విభాగాధిపతులు, అధ్యాపకులు, పెద్దసంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## వ్యవసాయ ఆధారిత పథకాల ప్రగతిపై..

# రాజ్యసభలో బీఎంఆర్ ప్రశ్న!



వ్యవసాయ ఆధారిత వ్యవస్థాపకులకు మద్దతు ఇచ్చే పథకాల గురించి రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు ఇటీవల రాజ్యసభలో ప్రశ్నించారు. ఆ పథకాల ప్రగతి వివరాలేమిటని అడిగారు. అందుకు కేంద్ర వ్యవసాయం–రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్‌చౌహాన్ సమాధానమిస్తూ, వ్యవసాయ ఆధారిత వ్యవస్థాపకులకు (అగ్రి ప్రెన్యూర్స్) మద్దతు ఇవ్వడానికి ప్రధాన మంత్రి కృషి వికాస్‌యోజన(పీఎంఆర్‌కెవివై) పథకం కింద "ఆవిష్కరణ మరియు వ్యవసాయ–వ్యవస్థాపక అభివృద్ధి కార్యక్రమం', వ్యవసాయ ఆధారిత స్టార్టప్‌లకు ఆర్థిక మరియు సాంకేతిక సహాయాన్ని, శిక్షణను ఇస్తున్నారని తెలిపారు. ఈ పథకం కింద 1749 వ్యవసాయ స్టార్టప్‌లకు రూ.124.96 కోట్ల ఆర్థిక సహాయం విడుదల చేశామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో 62 స్టార్టప్‌లు ఉన్నాయని, నాబార్డ్ ఆధ్వర్యంలో నాబ్‌వెంచర్స్ లిమిటెడ్ ద్వారా 'అగ్రి స్యూర్' పథకం కూడా ప్రారంభించారని తెలిపారు. వ్యవసాయ మౌలిక సదుపాయాల నిధి (ఏఐఎఫ్) పథకం ద్వారా పంటకోత అనంతర మౌలిక సదుపాయాలు, మరియు కమ్యూనిటీ వ్యవసాయ ఆస్తులకు దీర్ఘకాలిక రుణాలు, సాంకేతికత సహాయం, వ్యాపార స్థిరత్వాన్ని నిర్ధారిస్తూ, ఏడు సంవత్సరాల వరకు దీర్ఘకాలిక తిరిగి చెల్లింపు కాలపరిమితిని అందిస్తుందని వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటివరకు 1793 మంది అభ్యర్థులకు శిక్షణ ఇవ్వడం జరిగిందని, వీరిలో 516 మంది తమ వ్యవసాయ క్షేత్రాలను స్థాపించారని, మరో 22 మంది అభ్యర్థులకు సబ్సిడీ పొడిగించామని చెప్పారు, ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరుజిల్లాలో ఇప్పటివరకు 42మంది అభ్యర్థులకు ఏసీ అండ్ ఏబీసీ పథకం కింద శిక్షణ ఇవ్వగా, 16మంది అభ్యర్థులు వ్యవసాయక్షేత్రాలు స్థాపించారని విశదీకరించారు. నెల్లూరుజిల్లాలో ఒకే ఒక స్టార్టప్ శిక్షణ పొందిందని, అయితే, ఇప్పటి వరకు ఏ స్టార్టప్‌కు నిధులు ఇవ్వలేదని ఆయన వివరించారు.

## ఢిల్లీ అఖిలపక్ష సమావేశంలో.. బీఎంఆర్

భారత ఉపరాష్ట్రపతి మరియు రాజ్యసభ ఛైర్మెన్ జగదీప్ ధన్‌ఖడ్ అధ్యక్షతన ఇటీవల న్యూఢిల్లీలో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాజ్యసభలో పలు పార్టీల ఫ్లోర్‌లీడర్లు పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీ తరపున రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావుయాదవ్ (బీఎంఆర్) తదితరులు పాల్గొన్నారు.

## రంజాన్ తోఫా

# పంపిణీ చేసిన అర్జున్‌రెడ్డి



రంజాన్ పండుగ సందర్భంగా ఇటీవల బుచ్చిరెడ్డిపాళెం పెద్ద మసీదులో ఇమామ్, మౌజన్లకు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తనయుడు అర్జున్ రెడ్డి రంజాన్‌తోఫా కిట్లను పంపిణీ చేశారు. అనంతరం, ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ముస్లిం మత గురువులు ఆశీర్వచనాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ మైనారిటీ నాయకులు షబ్బీర్, మహబూబ్ బాషా, సందాని, కౌన్సిలర్ రహమాత్, ఫిరోజ్ పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన

# యోగా వెల్‌నెస్ సెంటర్లు ఎన్ని?

### లోక్‌సభలో విపిఆర్ ప్రశ్న



జాతీయ ఆయుష్ మిషన్ కింద ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఎన్ని యోగా వెల్‌నెస్ కేంద్రాలు కేటాయించారో తెలియజేయాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కోరారు. లోక్‌సభలో ఇటీవల ఆయన మాట్లాడుతూ, 2014–15 నుంచి 2019–20 మధ్య రాష్ట్రానికి 50కి పైగా యోగా వెల్‌నెస్ సెంటర్లు ఆమోదించారన్నది వాస్తవమేనా అని కూడా అడిగారు. 2020–21 నుంచి 2024–25 మధ్య ఆమోదించబడిన యోగా వెల్‌నెస్ కేంద్రాల వివరాలను కోరారు. అందుకు, కేంద్ర ఆయుష్ శాఖ సహాయ మంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్ లిఖితపూర్వకంగా సమాధానం ఇస్తూ, 2014–15 నుంచి 2019–20 మధ్య ఆంధ్రప్రదేశ్‌లో నేషనల్ ఆయుష్ మిషన్ కింద 13 యోగా వెల్‌నెస్ కేంద్రాలను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. అదే విధంగా 2020–21 నుంచి 2024–25 మధ్య 45 యూనిట్లను కేటాయించిందని వివరించారు. ఇక రాష్ట్ర ప్రభుత్వం నివేదించిన ప్రకారం ఫిబ్రవరి 2025 నాటికి 13 యోగా వెల్‌నెస్ కేంద్రాలు పనిచేస్తున్నాయని పేర్కొన్నారు.

# వెంకయ్య చొరవతోనే.. ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం!

### – ఎమ్మెల్యే సోమిరెడ్డి



భారత పూర్వ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు చొరవతోనే నెల్లూరుజిల్లా వెంకటాచలంలో ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం ఏర్పడిందని, సర్వేపల్లి నియోజకవర్గానికి ఇలాంటి అవకాశం లభించడం పెద్దాయన వెంకయ్యనాయుడి ఘనతేనని మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చెప్పారు. ఉగాది సందర్భంగా ఆ అధ్యయన కేంద్రంలో జరిగిన కవిసమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రానికి స్వయంప్రతిపత్తి కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. దాదాపు 200 మందికి పైగా కవులు సర్వేపల్లి నియోజకవర్గంలోని ఈ కేంద్రంలో జాతీయ సమ్మేళనం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం, డాక్టర్ తిరుమల స్వాతి రచించిన మాడభూషి కవిత్వాను శీలన గ్రంథాన్ని ఆయన ఆవిష్కరించి, కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులను సన్మానించారు. కేంద్రం డైరెక్టర్..ప్రముఖ కవి మాడభూషి సంపత్‌కుమార్ మాట్లాడుతూ, ప్రస్తుతం మైసూరులోని కన్నడ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రానికి స్వయం ప్రతిపత్తి కావాలని కోరారు. మన కేంద్రమంత్రులు, రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో స్వయంప్రతిపత్తి వస్తుందని ఆకాంక్షించారు. ఇప్పుడు స్వర్ణభారత్ ట్రస్ట్ భవనంలో తాత్కాలికంగా నడుస్తున్న ఈ కేంద్రానికి జాతీయ రహదారి పక్కనే 5 ఎకరాల భూమి కేటాయింపు జరిగిందని, భవన నిర్మాణానికి రూ.50 కోట్ల నిధులు అవసరమని కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని తెలిపారు. నెల్లూరుతో పాటు, వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో కవులు కవిసమ్మేళనంలో పాల్గొన్నారు.


శుభ స్వీకరణ



జననం 15.04.1955

నిర్యాణం 26.03.2025

మా ఇంటి దీపం, మా కంటి వెలుగు

శ్రీమతి కొంకా అమరావతి గారు

తేది. 26.03.2025, బుధవారం స్వర్గస్తులైనారు.

వారి ఆత్మశాంతికై ప్రార్థిస్తూ...

భర్త: కే.యం.నాగభూషణం

('లాయర్' పత్రిక మాజీ తిరుమల విలేఖరి)

కుమారులు
కొంకా కిషోర్
కొంకా సాయికుమార్

కుమార్తె
కే.పద్మజ కిరణ్
మరియు కుటుంబసభ్యులు

90977 79991 - 92469 84649

వారి ఉత్తరక్రియలు (పెద్దకర్మ): తేది.9.04.2025, బుధవారం ఉదయం తిరుపతి గోవింద ధామం నందు జరుగును. బంధుమిత్రులకి తెలియజేయడమైనది.


# సామాజిక న్యాయం టీడీపీతోనే సాధ్యం

### – ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



తెలుగు ప్రజల ఆత్మ గౌరవం కోసం స్వర్గీయ ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ స్థాపిస్తే.. తెలుగు ప్రజల ప్రతిభకు విశ్వవ్యాప్త గుర్తింపు తెచ్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిదని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చెప్పారు. తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఇటీవల బుచ్చిరెడ్డిపాళెంలో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి తెలుగుదేశం పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం, పద్మావతి కళ్యాణ మండపంలో నిర్వహించిన సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలో 43ఏళ్లుగా పార్టీ జెండామోసి టీడీపీ కార్యకర్తలకు స్ఫూర్తిగా నిలిచిన సుబ్బారెడ్డి, బషీర్‌లను ఆమె సన్మానించారు.

ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ, దేశంలోనే తొలిసారిగా మహిళలకు ఆస్తిలో హక్కు, పేదవాడి కడుపు నింపే రెండు రూపాయలకు కిలోబియ్యం, నిరుపేదలకు పక్కా ఇళ్ళు లాంటి ఎన్నో ప్రజాసంక్షేమ కార్యక్రమాలతో దేశంలోనే సంక్షేమ పాలనకు శ్రీకారం చుట్టిన పార్టీ ఒక్క తెలుగుదేశం పార్టీయేనన్నారు. ఆ తర్వాత, పార్టీ పగ్గాలు చేపట్టిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎన్టీఆర్ స్ఫూర్తిగా నేటికీ కూడా బడుగు బలహీన వర్గాలకు పెద్దపీట వేస్తున్నారన్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు యువగళం పేరుతో పాదయాత్ర చేపట్టి తండ్రికి తగ్గ తనయుడని లోకేష్‌బాబు నిరూపించుకున్నారని ప్రశంసించారు.

కార్యకర్తలకు ఏ ఆపద వచ్చినా ఆదుకుంటానని, పార్టీ కోసం కష్టపడ్డ ఏ కార్యకర్తకు అన్యాయం జరగదని ఆమె హామీ యిచ్చారు. టీడీపీ రూరల్, అర్బన్ అధ్యక్షులు బత్తుల హరికృష్ణ, ఎంవి శేషయ్య, మున్సిపల్ ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, వైస్ ఛైర్మెన్లు యరటపల్లి శివకుమార్‌రెడ్డి, నస్రీన్ ఖాన్, కౌన్సిలర్ తాళ్ల వైష్ణవి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# తెలుగుజాతి ఖ్యాతి.. ఎన్టీఆర్

## కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతమ్మ



తెలుగుజాతి ఖ్యాతి ఎన్టీఆర్ అని, రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాలవారిని నాయకులుగా తీర్చిదిద్దిన ఘనత తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, స్వర్గీయ నందమూరి తారక రామారావుకే దక్కుతుందని కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతమ్మ అన్నారు. తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నెల్లూరులోని జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, చేజర్ల వెంకటేశ్వర్లు రెడ్డి, తాళ్లపాక రమేష్‌రెడ్డి, తాళ్లపాక అనురాధ, ధూలక్ష్మి, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. తొలుత, ఎమ్మెల్యే ప్రశాంతమ్మ ముందుగా కార్యాలయంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఎన్నో ఒడిదుడుకులు. ఎదుర్కొన్నా.. ఇంత బలంగా పార్టీ నిలబడిందంటే అందుకు కార్యకర్తలు, నాయకులు, సమర్థవంతమైన నాయకత్వమే కారణమన్నారు. ఆయన ఆశయ సాధనకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, యువ నాయకులు లోకేష్ ఎంతో కృషి చేస్తున్నారని చెప్పారు.

# మహిళల భద్రతకు భరోసా.. 'శక్తి యాప్'!

## రూరల్ డీఎస్పీ శ్రీనివాసరావు



మహిళల భద్రత కోసం రాష్ట్రప్రభుత్వం ప్రారంభించిన 'శక్తి యాప్' ఎంతగానో ఉపయోగపడుతుందని, అత్యవసర సమయాల్లో మహిళలు ఈ యాప్ ద్వారా ఒక్క క్లిక్‌తో పోలీసులకు సమాచారం అందించవచ్చని నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు చెప్పారు. ఇటీవల స్థానిక విక్రమసింహపురి విశ్వవిద్యాలయం-మహిళా విభాగం, జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాలతో జిల్లా పోలీస్ శాఖ సంయుక్తంగా సమావేశం ఏర్పాటుచేసి, విద్యార్థినులకు ఈ యాప్‌పై అవగాహన కలిగించారు. మహిళలు మరింత సురక్షితంగా ఉండేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా రూపొందించిన శక్తి యాప్ ఉపయోగపడుతుందన్నారు. ఈ యప్‌ను ఎలా వినియోగించుకోవాలో ఆయన తెలియజేశారు. యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకునే విధానం, రిజిస్ట్రేషన్ ప్రక్రియ, అత్యవసర పరిస్థితుల్లో ఆ యాప్‌ను ఉపయోగించే విధానం వంటి అంశాలను పోలీసులు తెలియజెప్పారు. విశ్వవిద్యాలయ ప్రిన్సిపాల్ ఆచార్య సిహెచ్. విజయ మాట్లాడుతూ, మహిళా భద్రతకు నేటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఎంతో కీలకమని, "శక్తి యాప్" ద్వారా విద్యార్థినులు తమ భద్రతను మెరుగు పరుచుకోవచ్చని చెప్పారు. విద్యార్థినులు తప్పనిసరిగా ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, దాని వినియోగంపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. డాక్టర్ హనుమారెడ్డి, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసరెడ్డి, శక్తి టీమ్ ఎ.ఎస్.ఐ సుబ్బరాజు, హెడ్ కానిస్టేబుల్ శామ్యూల్, కానిస్టేబుళ్ళు శ్రీనివాసులు, రంగయ్య, మహిళా కానిస్టేబుల్ సుప్రియ, మహిళా అధ్యాపకులు, పెద్దసంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.

# జగనే మాయ

(మొదటిపేజీ తరువాయి)

2 వేల కోట్లను దుబాయ్‌కి, మరో 1000 కోట్లను ఆఫ్రికాకు తరలించారని పేర్కొన్నారు. సినిమాలో ప్రీ ప్రొడక్షన్, ప్రొడక్షన్, డిస్ట్రిబ్యూషన్ ఉన్నట్లే.. ఏపీ మద్యం కుంభకోణంలోనూ దోపిడీ జరిగిందని విమర్శించారు. 2024 ఎన్నికల సమయంలోనే బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లిక్కర్ స్కాంకు సంబంధించిన వివరాలను రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు అందజేశారని తెలిపారు.

### పక్కా స్కెచ్‌తోనే...?

సాధారణంగా మద్యం దుకాణం సూపర్‌వైజర్ తనకు సరుకు ఎంత అవసరమో, ఏఏ బ్రాండ్‌లు కావాలో ఆన్‌లైన్‌లో డిపో మేనేజర్‌ను అడగాలి. కానీ వైఎస్సార్‌సీపీ హయాంలో సూపర్‌వైజర్‌ను సేల్స్‌కు మాత్రమే పరిమితం చేశారనే ఆరోపణలున్నాయి. ఏకంగా డిపో మేనేజర్ ద్వారానే తమకు సంబంధించిన బ్రాండ్‌లు లేదా తాము ఉత్పత్తి చేసిన బ్రాండ్‌లు లేదా తమకు కమీషన్ ఇచ్చే బ్రాండ్‌లను మాత్రమే ఇండెంట్‌గాపెట్టారు. ఇవే అమ్మాలని సేల్స్‌పర్సన్స్‌కు, సూపర్ వైజర్లకు ఆదేశాలు జారీ చేశారు. వారు కూడా వీటినే విక్రయించేవారు. వినియోగదారులు ఇతర బ్రాండ్‌లు అడిగితే అవి లేవు, ఇవే ఉన్నాయి అంటూ సమాధానం ఇచ్చేవారు. ఇక పాత, పెద్ద, ప్రముఖ కంపెనీలు తమ బ్రాండ్‌లను ఎందుకు అమ్మడం లేదని ప్రభుత్వాన్ని అడిగితే మీ సరుకు ఎవరూ అడగడం లేదంటూ సమాధానం ఇచ్చేవారు. తద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఏ బ్రాండ్ ఎంత అమ్ముడవుతోందనే వివరాలను ఏపీ బేవరేజస్ కార్పొరేషన్‌లో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేసే అనూష ద్వారా అప్పటి ఆర్థిక సలహాదారుగా పనిచేసిన కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి తెప్పించుకుని, తద్వారా ప్రభుత్వం ఆయాసంస్థలకు బిల్లులు చెల్లించేటప్పుడు తగినంతగా కమీషన్లు వసూలు చేసేవారని సమాచారం. అనంతరం బినామీల ద్వారా అప్పటి ప్రభుత్వంలోని పెద్దసార్‌కు అందజేసినట్లు కూటమి నేతల ఆరోపణ. ఇదే విషయాన్ని ఇటీవల కాకినాడ సెజ్‌లో అక్రమంగా వాటాల కొనుగోలు కేసుకు సంబంధించి సీఐడీ ఎదుట హాజరైన మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కూడా ధ్రువీకరించారని టీడీపీ నాయకులు చెప్తున్నారు. ఇక మద్యం కుంభకోణానికి కర్త, ఖర్మ, క్రియ కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అని విజయసాయిరెడ్డి చెప్పడం ఈ వాదనలకు బలం చేకూర్చుతోందని స్పష్టం చేస్తున్నారు. ఇక దశలవారీగా మద్య నిషేధం విధిస్తామంటూ అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్ ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలు మొత్తం మద్యం ఆదాయం మీదనే నడిపించడం నాయకుడి నైజాన్ని తెలియజేస్తోందనే విమర్శలు కూడా వ్యక్తమవుతున్నాయి.

### డిస్టలరీస్‌ను తరిమేసి....

అడ్డదిడ్డమైన నిబంధనల పేరుతో అప్పటివరకు ఉన్న మద్యం డిస్టలరీస్‌ను తరిమివేసి, వాటి స్థానంలో తమకు సంబంధించిన ఊరు పేరు లేని నాసిరకం మద్యం బ్రాండ్‌లను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ దుకాణాల్లో విక్రయించి సొమ్ము చేసుకుందని కూటమి నాయకులు పెద్దఎత్తున ఆరోపిస్తున్నారు. అలాగే ఇతర మద్యం ఉత్పత్తిసంస్థల నుంచి కూడా కమీషన్ల రూపంలో భారీగా వసూళ్లకు పాల్పడినట్లు విమర్శిస్తున్నారు. వీటిపై విచారణ కోసం తొలుత సీఐడీని రంగంలోకి దించినా అనుకున్న మేరకు ప్రయోజనం కనిపించకపోవడంతో ఏడుగురు సభ్యులతో సీనియర్ ఐపీఎస్ అధికారి రాజశేఖర్‌బాబు నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు సంస్థను కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అప్పటి ఏపీ బేవరేజస్ కార్పొరేషన్ ఎండీ వాసుదేవరెడ్డిని, డిప్యూటీ ఎండీ సత్యప్రసాద్ సహా ఐదుగురు కీలకమైన సిబ్బందిని సిట్ అదుపులోకి తీసుకుని విచారణ చేసింది. అలాగే ఏపీ బేవరేజస్ కార్పొరేషన్‌కు సంబంధించిన కంప్యూటర్లు, హార్డ్‌డిస్క్‌లను సీజ్‌చేసి వాటిలోని వివరాల ఆధారంగా కుంభకోణం ఎలా జరిగింది, 2018వరకు ఏఏ బ్రాండ్‌లను అమ్మారు, 2019 నుంచి కొత్త బ్రాండ్‌లను సరఫరాచేసిన డిస్టలరీస్ ఏవి? వాటిని ఎంతరేటుకు బేవరేజస్ కార్పొరేషన్ కొన్నది, అనే అంశాలను కూడా సిట్ పరిశీలిస్తోంది. కాగా, ఈ మేరకు దర్యాప్తు తుది దశకు చేరినట్లు తెలుస్తోంది. అందుకే ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మద్యం కుంభకోణాన్ని పార్లమెంట్‌లో ప్రస్తావించి కేంద్ర పెద్దల దృష్టిని ఈ విషయంపైకి మళ్లించారని, కొన్ని సాక్ష్యాలతో కూడిన వివరాలను కూడా హోంమంత్రి అమిత్‌షాకి స్వయంగా అందించారనే ప్రచారం కూడా సాగుతోంది. దీంతో వైఎస్సార్‌సీపీలో పెద్దచేపకే కూటమి ప్రభుత్వం గాలం వేసే పని ప్రారంభించిందనే ప్రచారం జోరందుకుంది.

### అరెస్టులకు సమయం ఆసన్నమైందా..?

ఇక మద్యం కుంభకోణం వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైన నేపథ్యంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులకు అరెస్టుల భయం పట్టుకుందనే ప్రచారం కూడా జోరుగా సాగుతోంది. ఇప్పటికే రెడ్‌బుక్ అరెస్టుల పేరుతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ఆ పార్టీకి ఈ మద్యం కుంభకోణం అంశం తెరపైకిరావడం కొత్త తలనొప్పే అని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు. గురువారం సైతం కోర్టు ఆయన అభ్యర్థనను తిప్పి కొట్టింది. బెయిలు నిరాకరించింది. అదే సమయంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌పై కూడా చర్యలుంటాయనే ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. అయితే దీన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు ఖండిస్తున్నారు. తమ పార్టీ నాయకులు ఏ తప్పూ చేయలేదని, అనవసరంగా బురదజల్లే కార్యక్రమంలో భాగంగానే టీడీపీ నాయకులు మద్యం కుంభకోణం అంటూ హడావుడి చేస్తున్నారని మాజీ మంత్రులు అంబటి రాంబాబు, పేర్ని నాని ఆరోపించారు. సీఐడీ, ఏసీబీ, పోలీసు కేసులకు, నిర్బంధాలకు, అరెస్టులకు భయపడే ప్రసక్తే లేదని స్పష్టంచేస్తున్నారు. అయితే, లోలోన మాత్రం ముందస్తు బెయిళ్ల కోసం, అరెస్టుల నుంచి మినహాయింపుల కోసం యత్నిస్తుండడం గమనార్హం. ఏదేమైనా మద్యం కుంభకోణం రాష్ట్ర రాజకీయలను మరింత రసవత్తరంగా మార్చడం మాత్రం ఖాయంగా కనిపిస్తోంది. దేవదాసు సినిమాలో 'జగమే మాయ' అంటూ అక్కినేని పాడిన పాటని గుర్తుచేసుకుంటూ 'జగనే మాయ' అని ఆ పార్టీ శ్రేణులే పాడుకుంటున్నారని విశ్లేషకులు అంటున్నారు.

ఇక కొసమెరుపు ఏంటంటే.. వచ్చే 25 ఏళ్ల వరకు మద్యం అమ్మకాలపై లభించే ఆదాయాన్ని చూపించి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ. 25 వేల కోట్లు రుణం పొందినట్లు విమర్శలు జోరందుకోవడం గమనార్హం. కాబట్టే జగమే మాయ కాదు, జగనే మాయ..!

# టూకీగా...



## మద్దెలమడుగు వద్ద.. ఎర్రచందనం దుంగల పట్టివేత

రాపూరు మండలం మద్దెలమడుగు చెక్‌పోస్టు వద్ద ఏప్రిల్ 1న అటవీఅధికారులు వాహనతనిఖీలు చేస్తూ, సుమారు రూ. 15 లక్షల విలువచేసే ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. గడ్డిమోపుల కింద దాచిపెట్టి వాటిని తీసుకు వెళ్తుండగా పట్టుకున్నామని, డ్రైవర్ ఆ వాహనాన్ని వదిలేసి పారిపోయాడని రాపూరు అటవీశాఖ రేంజర్ రవీంద్రబాబు తెలిపారు.

## దేవరదిబ్బ గిరిజనులకు అన్నదానం

ముత్తుకూరు మండలం పైనంపురం పంచాయతీలోని దేవరదిబ్బ గిరిజనులకు జనసేన కార్యకర్తలు అన్నదానం చేశారు. ఏప్రిల్ 1న జనసేన సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ పుట్టినరోజు సందర్భంగా ఈ సేవా కార్యక్రమం నిర్వహించారు. వీర మహిళ భవానినాయుడు, జన సైనికులు పాల్గొన్నారు.

## పొదలకూరులో ఉచిత దంతవైద్య పరీక్షలు

పొదలకూరు నరసారెడ్డికాలనీలో ఉన్న వృద్ధాశ్రమంలోని వృద్ధులకు ఏప్రిల్ 1న స్థానిక సామాజిక ఆరోగ్యకేంద్రం దంత వైద్యనిపుణురాలు రాధాకుమారి ఆధ్వర్యంలో ఉచితంగా దంత వైద్యపరీక్షలు చేశారు. దంత పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వారికి వివరించారు.

## పిడూరులో లైట్లు లేని విద్యుత్ స్తంభాలు

మనుబోలు జాతీయరహదారి నుంచి పిడూరు గ్రామానికి వెళ్ళే దారంతా కరెంటు స్తంభాలున్నాయి కానీ, మూడు నెలలైనా వాటికి లైట్లు బిగించలేదు. దీంతో, రాత్రయితే చాలు.. పిడూరుకి వెళ్లాలంటే భయంగా ఉందంటున్నారు గ్రామస్తులు. ఒకవైపు రోడ్డంతా గుంటలు మిట్టలు.. మరోవైపు విద్యుత్ లైట్లు లేకపోవడంతో.. రాకపోకలకు కష్టంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## మర్రిపాడులో పొగాకు బ్యారెన్ దగ్ధం

మండల కేంద్రమైన మర్రిపాడులో ఏప్రిల్ 1న ఓ పొగాకు బ్యారెన్‌లో ప్రమాదవశాత్తూ అగ్నిప్రమాదం జరిగి, బ్యారెన్ అగ్నికి ఆహుతైపోయింది. బాధితులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చినా, వారు వచ్చేలోగానే బ్యారెన్ మంటల్లో కాలిపోయింది. దీంతో నాలుగు లక్షల వరకు ఆస్తినష్టం జరిగిందంటూ బాధితులు లబోదిబోమంటున్నారు.

## బుచ్చి ఆర్‌ఆర్‌నగర్‌లో మజ్జిగ చలివేంద్రం

ఈ మండుతున్న ఎండల్లో పాదచారులకు చల్లని మజ్జిగను, మంచినీటిని అందిస్తున్నారు బుచ్చిరెడ్డిపాళెంలోని 'మఠం యూత్' సంస్థ నిర్వాహకులు. ఏప్రిల్ 1న వారు ఆ చలివేంద్రం ప్రారంభించి ప్రజల దాహార్తిని తీరుస్తున్నారు.

## రొంపిదొడ్లలో మంచినీటి కటకట!

సీతారామపురం మండల పరిధిలోని రొంపిదొడ్ల గ్రామంలో మంచినీటికి కటకట ఏర్పడడంతో గ్రామస్తులు అనేక అవస్థలు పడుతున్నారు. గ్రామంలోని రక్షిత మంచినీటి పథకం మరమ్మతులకు గురై ఉందని, బోరు చెడిపోవడంతో నీళ్ళకు ఇబ్బందిగా ఉందని, జిల్లా ఉన్నతాధికారులు వెంటనే పరిశీలించి, నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## కోవూరులో రేషన్‌కార్డుదారుల ఇకెవైసీపై ఆరా

కోవూరులో రేషన్‌కార్డుదారుల ఇకెవైసీ నమోదు ప్రాంతాన్ని ఏప్రిల్ 1న కోవూరు తహశీల్దార్ నిర్మలానందబాబా పరిశీలించి, నమోదు ఎలా ఉందో ఆరా తీశారు. రేషన్‌కార్డుదారులంతా తప్పనిసరిగా ఈనెల 31వ తేదీలోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని స్పష్టం చేశారు. రేషన్‌డీలర్ల సంఘం రాష్ట్ర సంఘం నాయకులు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మోటారు దొంగలు దొరికారు

జిల్లాలోని తోటపల్లిగూడూరు, ముత్తుకూరు, ఇందుకూరు, నెల్లూరు మండలాల్లో పలుచోట్ల పొలాల్లో ఉన్న విద్యుత్‌మోటార్లను చోరీచేసిన ఐదుగురిని ఇటీవల పోలీసులు పట్టుకున్నారు. వారివద్ద ఉన్న కొన్ని మోటార్లను స్వాధీనం చేసుకుని, వారిపై కేసు నమోదు చేసినట్లు తోటపల్లిగూడూరు ఎస్ఐ వీరేంద్రబాబు ఏప్రిల్ 1న తెలిపారు.

# ఉప రాష్ట్రపతితో..బీఎంఆర్ భేటీ!



భారత ఉపరాష్ట్రపతి మరియు రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్కడ్‌తో రాజ్యసభ సభ్యులు, మన నెల్లూరీయులైన బీద మస్తాన్‌రావుయాదవ్ (బీఎంఆర్) భేటీ అయ్యారు. ఈనెల 2న పార్లమెంటులోని ఉపరాష్ట్రపతి కార్యాలయంలో ఆయన కలిసి పలు అంశాలను చర్చించారు. ఆంధ్రప్రదేశ్‌లో అమలయ్యే అనేక అభివృద్ధి-సంక్షేమ కార్యక్రమాలు, పోలవరం ప్రాజెక్టు యొక్క పురోగతి, అమరావతిలో అభివృద్ధి కార్యక్రమాల విషయమై వారిరువురు చర్చించుకున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కొత్తగా ప్రారంభించిన 'పి4 మోడల్: మార్గదర్శి - బంగారు కుటుంబం' కార్యక్రమాలపై చర్చించారు. దార్శనికత, పరిపాలన దక్షత కలిగిన నాయకుడు చంద్రబాబునాయుడని, ఆయన పాలనలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందుతుందని ఈ సందర్భంగా ఉప రాష్ట్రపతి దన్ఖడ్ అన్నారు. అనంతరం, ఉప రాష్ట్రపతికి బీఎంఆర్ ధన్యవాదాలు తెలిపారు.

# సతీష్‌రెడ్డికి..కిన్నెర సాహితీ పురస్కారం

- తెలంగాణ గవర్నర్ చేతుల మీదుగా ప్రదానం



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు.. భారత రక్షణ రంగానికి విశిష్ట సేవలందించిన శాస్త్రవేత్త..మన నెల్లూరీయులు డాక్టర్ జి.సతీష్‌రెడ్డికి ఇటీవల తెలంగాణకు చెందిన ప్రతిష్ఠాత్మక కిన్నెర సాహితీ సంస్థ పురస్కారం వరించింది. తెలుగు సంవత్సరాది 'శ్రీ విశ్వావసు' ఉగాది సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ఆడిటోరియంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ చేతులమీదుగా డాక్టర్ సతీష్‌రెడ్డి ఆ అవార్డునందుకోవడం విశేషం. ఈ సందర్భంగా పలువురు వక్తలు భారత రక్షణ రంగ బలోపేతమే లక్ష్యంగా సతీష్‌రెడ్డి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్‌వి సుబ్రహ్మణ్యం తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

# భరతజాతి గర్వించదగ్గ వీరుడు..ఛత్రపతి శివాజీ!



భరతజాతి ఐక్యత కోసం పోరాడిన మహావీరుడు..భరతమాత ముద్దుబిడ్డ ఛత్రపతి శివాజీ వీరోచిత సేవలు స్ఫూర్తిదాయకమని వక్తలు కీర్తించారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ 345వ వర్ధంతి సందర్భంగా నెల్లూరు ట్రంకురోడ్డులోని శివాజీ సెంటర్ వద్దనున్న ఛత్రపతి శివాజీ విగ్రహానికి బీజేపీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు పి.సురేంద్రరెడ్డి మాట్లాడుతూ, భరతజాతి పౌరుషానికి ఆయనో ప్రతీక అన్నారు. జాతి గర్వించదగ్గ వీరుడు..గొప్ప త్యాగధనుడైన శివాజీని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని, ఆయన ఆశయాల బాటలో నడవాలని ఆకాంక్షించారు. భారతీయ జనతా పార్టీలోని వివిధ మోర్చాల కన్వీనర్ పి సురేంద్రరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అనేకమంది బీజేపీ-టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొని ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగుదేశం పార్టీ నగర నాయకులు పిట్టి సత్య నాగేశ్వరరావు మాట్లాడుతూ, శివాజీ మహారాజ్ పోరాటాలు చిరస్మరణీయాలని, భరతజాతి అంతా ఆ మహనీయుని ఎన్నటికీ స్మరించుకుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వి.హర్షవర్ధన్, కె.వి సుబ్రమణ్యం, బివిస్ రంగరాజన్,నూకల బాలసుబ్రమణ్యం, శ్రీహరి ఆచారి, మరాఠా మిత్ర మండలి నాయకులు ప్రకాష్ జగదేవ్, బాజీరావు తదితరులు పాల్గొన్నారు.



## పింఛన్ పెంచిన
# ఘనత టీడీపీదే!
### - ఎమ్మెల్యే సోమిరెడ్డి -

పింఛన్ అంటేనే ఎన్టీఆర్, చంద్రబాబు నాయుడు. వారివల్లే రాష్ట్రంలోని పేదలకు పింఛన్ సదుపాయం వచ్చింది. పింఛన్ ఘనత అంతా టీడీపీదేనని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చెప్పారు. ఇటీవల ఆయన నెల్లూరులో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ, అప్పట్లో రూ.30తో ఎన్టీఆర్ ప్రారంభించిన ఆ పింఛన్ ఇప్పుడు రూ.4 వేలకు చేరిందన్నారు. అంటే, ఇందులో రూ.2840 సీఎం చంద్రబాబునాయుడు పెంచినదేనని, గతంలో కాంగ్రెస్, వైకాపా సీఎంలు పెంచిన పింఛన్ 1130 రూపాయలు మాత్రమేనని అన్నారు. దేశంలోనే అత్యధికంగా .4వేల రూపాయలు పింఛన్ ఇస్తున్నది టీడీపీ కూటమి ప్రభుత్వమైతే, అందులో రూ. 2840 పింఛను మొత్తాన్ని పెంచిన ఖ్యాతి చంద్రబాబునాయుడికే దక్కుతుందని ఆయన కొనియాడారు.

# రైతుబజార్లలో..సపోటాలు

జిల్లాలోని సపోటా రైతులకు అండగా, వారు పండించిన పంటకు తగ్గట్టు మద్దతు ధరతో విక్రయాలు సాగించుకునేలా ప్రభుత్వం సూచనల మేరకు జిల్లా మార్కెటింగ్‌శాఖ ఏర్పాట్లు చేసింది. నెల్లూరు నగరంలోని నవాబుపేట, ఫత్తేఖాన్‌పేట రైతుబజార్లలోను, కందుకూరు, పొదలకూరు, కావలి రైతుబజార్లలోనూ ఆమేరకు రైతులు సపోటాలను విక్రయించుకోవచ్చని, రైతుబజార్లకు ఎలాంటి అద్దెను చెల్లించాల్సిన అవసరం లేదని, సపోటా రైతులకు ఉచితంగానే అక్కడ షాపులు కేటాయిస్తున్నామని జిల్లా జాయింట్ కలెక్టర్ కార్తీక్ ఈనెల 2న ఒక ప్రకటనలో తెలిపారు. సపోటా రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## 53 టీఎంసీలకు చేరిన..
# సోమశిల నీటిమట్టం

జిల్లాలోని రైతాంగానికి ప్రాణప్రదమైన సోమశిల రిజర్వాయరులో ఈనెల 2వతేదీ బుధవారం నాటికి నీటిమట్టం 53.160 టీఎంసీలకి చేరింది. వేసవి దృష్ట్యా రిజర్వాయర్లలో నీటిమట్టాలు తగ్గిపోతున్నాయి. ప్రస్తుతం నిల్వ ఉన్న నీటిలో 300 క్యూసెక్కుల నీటిని డెల్టాకి, ఉత్తర కాలువకు 300, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారవర్గాలు తెలిపాయి. అదేవిధంగా, రాపూరు మండలంలోని కండలేరు డ్యామ్‌లో నీటిమట్టం 48.399 టీఎంసీలకు చేరుకుంది. ఇందులోంచి పలు కాలువలకు 1300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

# సేవే లక్ష్యంగా ముందుకు సాగుతాం!

- టీడీపీ ఆవిర్భావ దినోత్సవంలో నాయకులు



రాష్ట్రంలోనే కాదు, దేశ రాజకీయాల్లోనే సంచలనాత్మక మార్పులకు ఎన్టీఆర్ ఆద్యులని, ఆయన చూపిన సేవా మార్గంలో తామంతా పయనిస్తామని తెలుగుదేశం పార్టీ నాయకులు చెప్పారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఇటీవల నెలూర్లులోని టీడీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో టీడీపీ నాయకుడు షేక్ అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో నాయకులు ఎన్టీఆర్ సేవలను మరోసారి గుర్తుచేసుకున్నారు. దాదాపు 43 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో టీడీపీ ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొందని, అయినప్పటికీ పార్టీ జనం హృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోయిందని అబ్దుల్ అజీజ్ అన్నారు. రాజకీయాలను సామాన్యులకు సైతం అందుబాటులోకి తెచ్చిన మహనీయుడు ఎన్టీఆర్ అని, ప్రజా సంక్షేమ పథకాలకు ఆయన శ్రీకారం చుట్టారని ఆయన కీర్తించారు. శాసన మండలి సభ్యులు బీదా రవిచంద్ర మాట్లాడుతూ, భారతదేశంలోనే మొదటిసారి ప్రాంతీయ పార్టీలను ఏకంచేసి కాంగ్రెస్ పార్టీ, ఇందిరాగాంధీకి వ్యతిరేకంగా నేషనల్ ఫ్రంట్ ఏర్పాటు చేసిన ఘనత ఎన్టీఆర్‌దేనని అన్నారు. ఆవిర్భవించిన రెండేళ్లలోనే పార్లమెంట్‌లో ప్రధాన ప్రతిపక్ష పాత్ర పోషించి చరిత్ర సృష్టించిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని, తెలుగుప్రజల గుండెచప్పుడుగా పార్టీ నిలిచిందన్నారు. చంద్రబాబునాయుడు నాయకత్వంలో, నారా లోకేష్ సారధ్యంలో తెలుగుదేశం పార్టీ మరింతగా జనాదరణ పొందుతోందన్నారు. తెలుగుదేశం పార్టీ అభ్యున్నతే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ చూపిన బాటలో ప్రజా సేవే లక్ష్యంగా, అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిరంతరం కృషిచేస్తున్నారని, తాము కూడా అదేబాటలో పయనిస్తామని టీడీపీ నాయకులు తెలిపారు.

## శ్రీసిటీని సందర్శించిన..
# రష్యన్ ఫెడరేషన్ కాన్సుల్ జనరల్!



చెన్నైలోని రష్యన్ ఫెడరేషన్ కాన్సుల్ జనరల్ వాలెరీ ఖోడ్జేవ్ ఈనెల 3వ తేదీ గురువారంనాడు శ్రీసిటీని సందర్శించారు. కాన్సుల్ జనరల్, ఆయనతో పాటు విచ్చేసిన అధికారుల బృందానికి శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి స్వాగతం పలికారు. ఇండో-రష్యన్ వాణిజ్య సంబంధాలు మరింత బలపడేందుకు, వ్యాపార సహకారాన్ని పెంపొందించడంలో ఈ పర్యటన అత్యంత కీలకమైనదని రవీంద్ర సన్నారెడ్డి తెలిపారు. ఇప్పటికే రష్యన్ సంస్థ కుయిబిషెవ్ అజోట్ పరిశ్రమ ఇక్కడ ఏర్పాటైందని, ఈ సందర్శన ఫలితంగా మరిన్ని రష్యన్ పరిశ్రమలు భారత మార్కెట్‌కు తమ ప్రధాన స్థావరంగా శ్రీసిటీని ఎంచుకుంటాయన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు. శ్రీసిటీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్) ఆర్.శివశంకర్, శ్రీసిటీ మౌలిక సదుపాయాలు, వ్యాపారానుకూల వాతావరణం, వేగవంతమైన అభివృద్ధి గురించి కాన్సుల్ జనరల్‌కు వివరించారు. శ్రీసిటీ ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, వ్యాపార అనుకూల వాతావరణంపట్ల సంతృప్తి వ్యక్తంచేసిన వాలెరీ ఖోడ్జేవ్, ఒక ప్రధాన వ్యాపార గమ్యస్థానంగా శ్రీసిటీ సామర్థ్యాన్ని ప్రశంసించారు. శ్రీసిటీకి ఉన్న బహుళ ప్రయోజనాల దృష్ట్యా, విభిన్న తయారీ రంగాలకు చెందిన మరిన్ని రష్యన్ కంపెనీలు ఇక్కడ పెట్టుబడి అవకాశాలను అన్వేషించే అవకాశం ఉందని ఆయన అన్నారు. ఈ పర్యటనలో భాగంగా కాన్సుల్ జనరల్ శ్రీసిటీ పరిసరాలతో పాటు కుయిబిషెవ్ అజోట్ పరిశ్రమను సందర్శించారు. మరియు సిద్ధార్థ లాజిస్టిక్స్ పరిశ్రమ మేనేజింగ్ డైరెక్టర్ నిశ్చల్ పొద్దార్‌తో చర్చలు జరిపారు.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com